విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్

తొలి ఆకాంక్ష



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



రిపోర్టర్లు కావలెను

పామరుడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాలో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు | మండల | నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 101 ఎడిటర్ :పెనుగొండ సతీష్ శుక్రవారం 28 నవంబర్ 2025 పేజీలు 8 వెల 5.00


## యువత వల్లే
# స్టార్టప్ విప్లవం

- ప్రపంచానికే ఆదర్శం మన యువత
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు
- మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, నవంబర్ 27 : భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్ మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మ విశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన

2లో

## గ్లోబల్ సమ్మిట్‌పై
# సీఎం రేవంత్ సమీక్ష

- పాలసీ డాక్యుమెంట్‌పై భేటీలో చర్చ



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్27 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై రోజూ వరుస సమీక్షలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి గురువారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రోజుకో అంశంపై చర్చిస్తున్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ

2లో

## సిగాచీ ఫార్మా పేలుడు
# ఘటన చిన్నదా?

- 54 మంది చనిపోయిన ఘటన చిన్నదేమీ కాదు
- పోలీసులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం
- నిందితులను గుర్తించకపోవడంపై తీవ్ర అసంతృప్తి
- డిసెంబర్ 9కి వాయిదా వేసిన ధర్మాసనం




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 27 : సిగాచీ ఫార్మా పరిశ్రమలో 54 మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న పేలుడు ఘటనలో పోలీసు దర్యాప్తు తీరును తెలంగాణ హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇంత పెద్ద దుర్ఘటన జరిగి నెలలు గడుస్తున్నా దర్యాప్తు పూర్తి కాకపోవడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది సాధారణ ప్రమాదం కాదని, ఇంతటి ఘోరంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని చెప్పడం

2లో

## ప్రశాంతంగా పంచాయితీ
# ఎన్నికల నిర్వహణ

- పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం
- పోలీస్ అధికారులతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్

(ఆకాంక్ష న్యూస్)




హైదరాబాద్, నవంబర్ 27 : రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల

2లో

## రాష్ట్ర అభివృద్ధిని
# ప్రతిబింబించేలా డాక్యుమెంట్

- భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా ఉండాలి
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించాలి
- సమ్మిట్‌కు ప్రధాని మోదీని ఆహ్వానిస్తున్నాం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై సీఎం రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై సమీక్ష



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,నవంబర్27 : పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు. కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకునే సమయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమ్మిట్‌లో సంక్షేమం, వైద్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు

2లో

# అబద్దాలకు అంబాసిడర్ కెటిఆర్

- అబద్దపు ప్రచారాలతో ప్రజలు ఏమార్చే రకం
- బిసి రిజర్వేషన్లపై చేస్తున్న వ్యాఖ్యలు సత్యదూరం
- కెటిఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన మంత్రి సీతక్క



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,నవంబర్ 27 : స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించిందన్న బిఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. అబద్దపు ప్రచారాలతో ప్రజలను ఏమార్చలేరని గట్టిగా జవాబు ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు

2లో

# నల్లచెరువులో ఆక్రమణలను మేం తొలగించలేదు

- తొలగింపులపై క్లారిటీ ఇచ్చిన హైడ్రా



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్27 : కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద బుధవారం తాము ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) స్పష్టం చేసింది. చెరువు భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, పేదల గుడిసెలంటూ తప్పుడు ప్రచారం

2లో

# కుంభకోణానికి ఆస్కారమే లేదు

- ఇండస్ట్రీయల్ పాలసీపై దుష్ప్రచారం
- పొల్యూషన్ ఫ్రీగా చేయడమే లక్ష్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్27 : ఇండస్ట్రీయల్ పాలసీ పై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీగా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు . బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రీయల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రీయల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రీయల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్

2లో

## మొదలైన పంచాయతీ
# ఎన్నికల సందడి..

- నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్లు షురూ!
- మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు

(ఆకాంక్ష న్యూస్)




హైదరాబాద్,నవంబర్27: తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాజకీయ సందడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తొలి విడత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికలు

2లో

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

- మళ్లీ గెలుస్తాం...కెసిఆర్‌ను సిఎంను చేస్తాం
- అసలు యుద్ధం 2028లో ఉంటుంది
- తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 27 : రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం..అధికారంలోకి వస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఎపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షంలో బయట పెడుదామని పిలుపు నిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని

2లో

# 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

**- సింగిల్ బెంచ్ ఉత్తర్వులు కొట్టివేత - ఉత్తర్వులను సస్పెండ్ చేసిన సీజే ధర్మాసనం**

**- తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా**

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 27 : 2015 గ్రూప్?-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్?-2పై సింగిల్? బెంచ్? ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్? చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సీజే ధర్మాసనం జారీ చేసింది. 2015 గ్రూప్?-2 నియామకాలు రద్దు చేస్తూ ఇటీవల సింగిల్? బెంచ్? తీర్పును ఇచ్చింది. సింగిల్? బెంచ్? తీర్పును పిటిషనర్? డివిజన్? బెంచ్?లో సవాల్? చేశారు. సింగిల్? బెంచ్? ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్? చేసింది.గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సీజే ధర్మాసనం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. 2019 అక్టోబర్ 24న చేపట్టిన గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్ 2 జవాబు పత్రాల్లో వైట్ నర్ వినియోగం, డబుల్ బబ్లింగ్ చేసిన పార్ట్ బీ పత్రాలను మూల్యాంకనం చేయడం చెల్లదని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్యాంపరింగ్ జరిగినట్లు స్పష్టంగా కనిపించినప్పటికీ వాటిని పక్కన పెట్టకుండా మూల్యాంకనం చేయడం చెల్లదని స్పష్టం చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా చేసిన మూల్యాంకనం ఆధారంగా చేపట్టిన నియామకాలు చెల్లవని రద్దు చేస్తూ మరోసారి మూల్యాంకనం చేసి అర్హుల జాబితాను విడుదల చేయాలని జస్టిస్ నగేశ్ బీమపాక ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతా 8 వారాల్లో ముగియాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ అప్పీలు దాఖలు చేశారు.కాగా ఈ అప్పీలు సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులు సరిగ్గా లేవని దీనివల్ల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తుందని వాదించారు. డబుల్ బబ్లింగ్, వైట్?నర్ వినియోగం అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని అన్నీ పరిగణలోకి తీసుకొని టీజీపీఎస్సీ నియామక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2019లో ఎంపికైన అభ్యర్థులు ఇప్పుడు వివిధ హోదాల్లో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల వల్ల వాళ్లందరికీ నష్టం జరుగుతుందన్నారు. అప్పీలుపై వాదనలు విన్న సీజే ధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ జారీ చేశారు. 2016లో మరికొన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చారు. వివిధ కేటగిరీల కింద మొత్తం 1,032 పోస్టులకు 2016 నవంబరులో పరీక్షలు నిర్వహించారు. కొంత మంది అభ్యర్థులు వైట్?నర్ ఉపయోగించారని మరికొంత డబుల్ బబ్లింగ్ చేశారని 2017లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. సాంకేతిక కమిటీ హైకోర్టుకు కొన్ని సూచనలు సమర్పించింది. దాని ప్రకారం ఓఎంఆర్ షీట్ లోని పార్ట్ ఏ లో వ్యక్తిగత వివరాలు, బుక్ లెట్ నెంబరుకు సంబంధించి చెరిపివేతలున్నా సమస్య కాదని తెలిపింది.పార్ట్ బీలో 150 ప్రశ్నల విషయంలో వైట్?నర్ వాడినట్లు గుర్తిస్తే ఆ జవాబులను పరిగణలోకి తీసుకోవద్దని సాంకేతిక కమిటీ సూచించింది. దీని ఆధారంగా మూల్యాంకనం చేసి 2019 అక్టోబరులో అర్హుల జాబితా ప్రకటించి నియామకపత్రాలిచ్చారు. ట్యాంపరింగ్ జరిగినా మూల్యాంకనం చేసి అర్హులను ఎంపిక చేశారంటూ మళ్లీ 6 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై సుదీర్ఘ విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ బీమపాక నియామకాలు రద్దు చేస్తూ ఈనెల 17వ తేదీన తీర్పు వెలువరించారు.

## మహబూబ్ పట్నం పంచాయతీ ఎన్నికపై స్టే

మహబూబాబాద్,నవంబర్27 : మహబూబాబాద్ జిల్లా మహబూబ్ పట్నం గ్రామ పంచాయతీ ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. ఆరుగురు ఓటర్లు ఉన్న ఎస్టీలకు ఒక సర్పంచ్, మూడు వార్డు స్థానాలు ఎలా రిజర్వ్ చేశారంటూ హైకోర్టు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మహబూబ్ పట్నంలో మూడు ఎస్టీ కుటుంబాలకు చెందిన ఏడుగురు ఓటర్లు ఉన్నారు. వీరికి సర్పంచ్‌తో పాటు మూడు వార్డులు కూడా కేటాయించారు. ఈ రిజర్వేషన్లు మార్చాలని గ్రామానికి చెందిన యాకూబ్, శ్రీకాంతాచారి, లింగయ్య, విజయ్, వెంకటమల్లు, పోలు నాగయ్య తదితరులు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. గతంలో మహమూద్‌పట్నం గ్రామ పంచాయతీ నుంచి తండాలను వేరు చేసి కొత్త పంచాయితీలు ఏర్పాటు చేశారని, దీంతో ఆ గ్రామంలో 576 ఓట్లు ఉన్నట్లు పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. 199 మంది ఎస్సీలు, 358 మంది బీసీలు, 13 మంది ఓసీలు, ఏడుగురు ఎస్టీలు ఓటు హక్కును కలిగి ఉన్నారని చెప్పారు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించడంతో సర్పంచ్ స్థానంతో పాటు 3 వార్డులు దక్కాయి. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలను రద్దు చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామ సర్పంచ్‌గా కొండం రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ సర్పంచ్‌తో పాటు 8 మంది వార్డ్ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండం రంగారెడ్డి బ్రదర్స్ గ్రామానికి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. దీంతో ఆ గ్రామస్తులంతా ఏకమై పార్టీలకతీతంగా సర్పంచ్‌గా రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి..

మొదటిపేజీ తరువాయి

మూడు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న, రెండో విడత డిసెంబర్ 14న, మూడో విడత డిసెంబర్ 17న జరిగేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ పంచాయతీ ఎన్నికలు 12,760 గ్రామ పంచాయతీలు, 1,13,534 వార్డులకు జరుగుతాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో పలు చోట్ల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.తొలి దశ నామినేషన్లు వేస్తున్నారు అభ్యర్థులు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 555 పంచాయతీలు, 4952 వార్డు స్థానాలకు మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. వరంగల్ 91 పంచాయతీలు, 800ల వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా 69 పంచాయతీలు , 658 వార్డు స్థానాలు, మహబూబాబాద్ జిల్లా 155 పంచాయతీలు, 1338 వార్డు స్థానాలు, జనగామ జిల్లా 110 పంచాయతీలు,1024 వార్డు స్థానాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా 82 పంచాయతీలు, 712 వార్డు స్థానాలు, ములుగు జిల్లా 48 పంచాయతీలు, 420 వార్డు స్థానాలకు గానూ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయి. మొదటి విడతలో 630 గ్రామ పంచాయతీలు, 5,598 వార్డులకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు. నల్గొండ జిల్లాలో నల్గొండ, చండూరు రెవెన్యూ డివిజన్లలోని 318 గ్రామ పంచాయతీలు, 2,870 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి రెవెన్యూ డివిజన్లలోని 159 గ్రామ పంచాయతీలు, 1,442 వార్డులకు నామినేషన్లు జరుగుతోంది. యాదాద్రి - భువనగిరి జిల్లాలో భువనగిరి రెవెన్యూ డివిజన్‌లోని 153 గ్రామ పంచాయతీలు, 1,286 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో... తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. ఆదిలాబాద్ జిల్లాలో 166, మంచిర్యాల జిల్లాలో 90, నిర్మల్ జిల్లాలో 136, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 114 సర్పంచ్, వార్డు స్థానాలకు తొలివిడత ఎన్నికలు జరుగుతోంది. అయితే, హైకోర్టు ఆదేశాల కారణంగా ములుగు, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోని 32 పంచాయతీలకు ఎన్నికలు జరగవు. తొలి విడతకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలవ్వడంతో.. ఈ దశలో 189 మండలాల్లో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు పూర్తి చేయాలని ఎస్ఈసీ కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. తొలి విడతకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. తొలి విడత నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ నవంబర్ 29. ఆ తర్వాత నవంబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 3 వరకు అవకాశం ఉంది. డిసెంబర్ 11న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ ఎన్నికల కోసం గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు. బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరుగుతుంది. నోటా (నాన్ ఆఫ్ ది అబౌవ్) ఆప్షన్ కూడా ఉంటుంది.పోలింగ్ పూర్తయిన అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమై, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు లేదా తదుపరి రోజు పూర్తి అవుతుంది. మొత్తం 31 జిల్లాల్లో 545 మండలాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఓటర్ల సంఖ్య 1.66 కోట్లు, వీరిలో మహిళలు 85.12 లక్షలు, పురుషులు 81.42 లక్షలు ఉన్నారు. రిజర్వేషన్ల పట్ల వివాదాలు ఉన్నప్పటికీ, బీసీలకు 17.08 శాతం (2,176 పంచాయతీలు) కేటాయించారు. దీనిపై బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కీలకం. గత 20 నెలలుగా ప్రత్యేక అధికారులు పరిపాలన చేస్తున్నారు. ఇప్పుడు కొత్త నాయకులు ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఎస్ఈసీ ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ (9240021456) ఉంది. మొబైల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఈ ఎన్నికలతో గ్రామాల్లో మార్పు రావాలని ఆశిస్తున్నారు. మొత్తం ప్రక్రియ డిసెంబర్ 17తో ముగుస్తుంది. ఓటర్లు తమ హక్కును వాడుకోవాలని ఎస్ఈసీ పిలుపునిచ్చింది.

## పవన్ కల్యాణ్‌వి తెలివితక్కువ మాటలు

మొదటిపేజీ తరువాయి

ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "మా దిష్టి వాళ్లకు తగలడం కాదు, ఇన్నేళ్లుగా వాళ్ల దిష్టే మా తెలంగాణకు, హైదరాబాద్‌కు తగిలింది" అని జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రతిరోజూ వందలాది మంది ఏపీ నుంచే హైదరాబాద్‌కు వస్తున్నారని, అలాంటప్పుడు తమ దిష్టి ఎలా తగులుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ దిష్టి తగులుతుందని అంత భయంగా ఉంటే, ఓ దిష్టిబొమ్మ పెట్టుకోవాలని, దాన్ని తామేమీ ఆపలేదని వ్యంగ్యంగా అన్నారు. "ఇంత తెలివిలేని వాళ్లు కూడా ఉప ముఖ్యమంత్రులు అవుతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం కోనసీమ జిల్లా రాజోలులో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పచ్చని కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలింది. ఇక్కడి కొబ్బరి చెట్ల పచ్చదనాన్ని చూసే బహుశా వారికి ప్రత్యేక రాష్ట్రం ఆలోచన వచ్చిందేమో" అని వ్యాఖ్యానించారు. నరుడి దిష్టికి రాయి కూడా పగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం కాగా, జగదీశ్ రెడ్డి తాజా ప్రతిస్పందనతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ మాటల యుద్ధం రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా డాక్యుమెంట్

మొదటిపేజీ తరువాయి

తదితర విభాగాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్లీనరీలో విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి ఈవెంట్ బాధ్యతను ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన డిజైన్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 2,600 మందిని సమ్మిట్‌కు ఆహ్వానించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

## రాజకీయాల్లో గెలుపోటములు సహజం

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వాయర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్ రెడ్డే చెప్పాడని అన్నారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, సాగునీరు తెచ్చుకున్నామని తెలిపారు. రైతుకు పెట్టుబడి రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్దాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిండు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

## ఢిల్లీలో ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

మొదటిపేజీ తరువాయి

నెట్‌వర్క్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో దిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి వందమంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలి, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పృథ్వీ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలు, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది. ముందస్తు పక్కా సమాచారంతో ఈగిల్ బృందం అక్కడి పోలీసుల సహకారంతో దీనిని చేపట్టింది. నైజీరియన్లను విచారిస్తే మరిన్ని వివరాలు రాబట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## కుంభకోణానికి ఆస్కారమే లేదు

మొదటిపేజీ తరువాయి

శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది..? అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

## అబద్ధాలకు అంబాసిడర్ కెటిఆర్

మొదటిపేజీ తరువాయి

పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందుకోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

## ప్రశాంతంగా పంచాయితీ ఎన్నికల నిర్వహణ

మొదటిపేజీ తరువాయి

ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని,ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్- 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వయిజర్ ఇ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సిగాచీ ఫార్మా పేలుడు ఘటన చిన్నదా?

మొదటిపేజీ తరువాయి

దారుణమని వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇప్పటికే 237 మంది సాక్షులను విచారించినా పురోగతి ఏది? పేలుడుకు బాధ్యులైన వారిని ఇప్పటివరకు ఎందుకు గుర్తించలేదు?" అని నిలదీసింది. ఇంతటి తీవ్రమైన ఘటనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయకపోగా, కేవలం డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిపై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో పారదర్శకత లోపించరాదని, వేగంగా పూర్తి చేసి బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించింది. అనంతరం, తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

## గ్లోబల్ సమ్మిట్‌పై సిఎం రేవంత్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు. కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

## యువత వల్లే స్టార్టప్ విప్లవం

మొదటిపేజీ తరువాయి

యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామాలలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల సందడి ప్రారంభం

మంథనినవంబర్ 27(ఆకాంక్ష): గ్రామపంచాయ తీ మొదటి విడత ఎన్నికల నామినేషన్ల సందడి గ్రామాల్లో మొదలైంది. నామినేషన్ల మొదటి రోజు అయిన గురువారం మంథని డివిజన్లోని మంథని, రామగిరి కమాన్పూర్, ముత్తారం నాలుగు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఈ క్రింది విధంగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. మంథని మండలంలో మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 37 నామినేషన్లు, వార్డు మెంబర్ల స్థానాలకు 13 నామినేషన్లు దాఖలు అయ్యాయి. కమాన్ పూర్ మండలంలో మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 16 నామినేషన్లు, వార్డు మెంబర్ల స్థానాలకు 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ముత్తారం మండలంలో మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 8 నామినేషన్లు, వార్డు మెంబర్ల స్థానాలకు 2 నామినేషన్లు దాఖలు అయ్యాయి. రామగిరి మండలంలో మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 10 నామినేషన్లు, వార్డు మెంబర్ల స్థానాలకు 4 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

# విద్యార్థులకు పండ్లు పంపిణీ



పెద్దపల్లిటౌన్. నవంబర్ 27(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జండా చౌరస్తా వద్ద గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులకు గాయత్రీ సేవా సమితి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో జాతిని జాగృతం చేసిన జాతీయ గీతం వందేమాతరానికి పాడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు పెద్దపల్లిలోని జండా చౌరస్తాలో స్కూల్స్, కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులతో గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గాయత్రి సేవా సమితి ద్వారా పండ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు కాసనగొట్టు వినయ్, సభ్యులు రావికంటి రాజు, చిట్టిమల్ల రవి, కాసనగొట్టు శ్రీనివాస్, నగునూరి శ్రీనివాస్,యెల్లెంకి రాజేందర్, గౌరిశెట్టి దయాకర్, కముటాల గురుచరణం, బొల్లం ఆంజనేయులు పాల్గొన్నారు.

# కొమురయ్యకు వాకింగ్ స్టాండ్ అందజేత

## - గోదావరిఖని జవహర్‌నగర్‌లో భరోసా సంస్థ సేవా కార్యక్రమం



గోదావరిఖని. నవంబర్ 27(ఆకాంక్ష) :పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్‌నగర్‌కు చెందిన కొమురయ్య కొద్ది రోజులుగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ స్వల్ప దూరం కూడా నడవలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం భరోసా సంస్థ ప్రతినిధుల దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన సంస్థ నిర్వాహకురాలు నసీమా కొమురయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన స్వల్పశ్రమతో అయినా నడవగలిగేందుకు ఉపయోగ పడే వాకింగ్ స్టాండ్‌ను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "సమాజంలో ఇలాంటి సహాయం అవసరమైన వారు ఎవరైనా కనిపిస్తే భరోసా సంస్థ ఎప్పుడూ ముందుంటుందని కొమురయ్య త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ స్వచ్ఛంద సేవకులు బొల్లం మధుబాబు, సరస్వతి పాల్గొని కొమురయ్యను ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిస్థితి గురించి విచారించి, అవసరమైన సందర్భంలో మరింత సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. జవహర్‌నగర్ ప్రాంత ప్రజలు భరోసా సంస్థ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తున్నారు. "ఇలాంటి సంస్థలు ముందుకు వస్తే ప్రజల్లో సేవా భావం మరింత పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# కేవలం కాగితాలకే పరిమితం అవుతున్న మెడికల్ బోర్డు

## - టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి



గోదావరిఖని, నవంబర్ 27(ఆకాంక్ష) : సింగరేణి కార్మికులపై మెడికల్ బోర్డు చేస్తున్న అన్యాయ నిర్ణయాలు అవకతవకలకు నిదర్శనమని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు...గత సంవత్సరం ఏప్రిల్ నుంచి అనారోగ్యంతో బాధపడి, పూర్తి జీతం లేక సగం వేతనం కూడా రాని పరిస్థితుల్లో ఉన్న 129 మంది కార్మికులపై ఇటీవల మెడికల్ బోర్డు నిర్వహించిందని తెలిపారు. వారిలో 13 మందికి 'ఫిట్ ఫర్ సేమ్ జాబ్'గా, సర్ఫేస్‌లో విధులు నిర్వహిస్తున్న 36 మందికి మళ్లీ అదే సర్ఫేస్ జాబ్ ఇచ్చారని అన్నారు. కృత్రిమ కాలుతో ఉన్నవారు, గుండె, మెదడు నాళాలపై స్టంట్ వేసుకున్నవారు, పక్షవాతంతో, అధిక షుగర్, బీపీతో బాధపడుతూ వైద్యులే సర్జరీకి నిరాకరించిన వారు కూడా 'ఫిట్ ఫర్ సేమ్ జాబ్'గా పేర్కొనడం అమానుషమని రాజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.గని ప్రమాదాలు ఎదుర్కొన్న వారికి తాత్కాలికంగా సర్ఫేస్ విధులు ఇచ్చి, ఇప్పుడు వారినే తిరిగి గనులలో పనిచేయమని ఒత్తిడి తేవడం దారుణమన్నారు. మైనింగ్ స్టాఫ్‌కు సూటేబుల్ సర్ఫేస్ జాబ్ ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పుకునే గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, అదే సిబ్బందికి జనరల్ మజ్దూర్ పనులు ఇవ్వడంపై సమాధానం చెప్పాలన్నారు.మెడికల్ బోర్డు పేరుతో జరుగుతున్న అన్యాయాలను టీబీజీకేఎస్ ఖండిస్తున్నదని, వెంటనే రెగ్యులర్ మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి స్పష్టమైందని, దీనిపై కార్మికులు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన నిర్ణయం తీసుకోవాల్సిందేనని పిలుపునిచ్చారు.ఈసమావేశంలో కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, నూనె కొమరయ్య, బండి రమేష్, పర్లపల్లి రవి, పోలాడి శ్రీనివాస్, చెలుకలపల్లి శ్రీనివాస్, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, మీనుగు సురేష్, అబ్బు శ్రీనివాసరెడ్డి, పొగాకుల రమేష్, వాసర్ల జోసెఫ్, రెహమాన్, వేణు, పులిపాక శంకర్, అన్వేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ఫేస్ జాబ్ ఇప్పిస్తానని మోసం చేసిన ఉడుత నాగరాజు

## - దళారీని నమ్మి లక్షల్లో నష్టపోయినని భరత్ కుమార్ ఆవేదన



గోదావరిఖని, నవంబర్ 27(ఆకాంక్ష) : సర్ఫేస్ జాబ్ ఇప్పిస్తానని నమ్మబలికి దళారీ ఉడుత నాగరాజు తనను లక్షల్లో మోసం చేశాడని బాధితుడు నీరుడు భరత్ కుమార్ గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. సింగరేణి ఉద్యోగం కోసం, తన వైద్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సర్ఫేస్ పోస్టింగ్ పొందాలనే ఆశతో నాగరాజును సంప్రదించగా, అతని మాయమాటలకు లోనై దాదాపు రూ.10 లక్షల వరకు నష్టపోయానని భరత్ కుమార్ కన్నీటి పర్యంతమయ్యారు. 2022లో సింగరేణిలో ఉద్యోగం పొందిన తనను జిడికే %-%2ఏ ఇంక్లైన్‌లో అండర్‌గ్రౌండ్ విభాగంలో పని చేయిస్తున్నారని, ఇదిలా ఉండగా బయట జరిగిన ప్రమాదంతో శారీరక ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. వైద్యులు ఇచ్చిన సూచనల మేరకు అండర్ గ్రౌండ్‌లో పని చేయడం సుసాధ్యం కాదని గ్రహించిన తాను 2024 ఆగస్టు 13న ఉడుత నాగరాజును సంప్రదించానని చెప్పారు. సర్ఫేస్ జాబ్ కల్పిస్తానని హామీ ఇచ్చిన నాగరాజు డబ్బులు అడగడంతో, తనకు తెలిసిన వ్యక్తి ఫోన్‌పే ద్వారా రూ.1,50,000 పంపించామని, అదనంగా మరికొంత మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించామని భరత్ వివరించారు.సంవత్సరం గడిచినా సర్ఫేస్ జాబ్ ఇప్పించక పోవడంతో నాగరాజును నిలదీయగా, "డ్యూటీలో చేరండి మీ డబ్బులు తిరిగి ఇస్తాను" అనే తప్పుదోవ పట్టించే సమాధానం మాత్రమే ఇస్తున్నాడని చెప్పారు. కానీ తనను "ఫిట్ ఫర్ జాబ్" అంటూ తిరిగి డ్యూటీలోకి పంపితే మళ్లీ అండర్‌గ్రౌండ్ పని చేయాల్సి వస్తుందని, ఇది తన ఆరోగ్య పరిస్థితికి పూర్తిగా విరుద్ధమని భరత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో డ్యూటీ చేయక పోవడం వల్ల తనకు దీపావళి బోనస్, దసరా అడ్వాన్స్, జీతాలు ఇలా మొత్తం కలిపి దాదాపు రూ.10 లక్షల మేర నష్టమైందన్నారు. ఈ మోసంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, కంప్లైంట్ ఇచ్చిన తేదీకి ముందే డబ్బులు తిరిగి ఇచ్చినట్లు తప్పుడు ఆన్‌లైన్ రికార్డులు సృష్టించి పోలీసులకు సమర్పించారంటూ తీవ్రమైన ఆరోపణలు చేశారు.అనంతరం జనగామ స్వప్న మాట్లాడుతూ ఐఎన్‌టియుసికి చెందిన ఓ నాయకుడి అనుచరుడిగా ఉన్న ఉడుత నాగరాజు ఈ మోసాన్ని కొనసాగించాడని ఆరోపించారు. ఆన్లైన్ ఆధారాలు కేవలం రూ.1,50,000 వరకు మాత్రమే ఉన్నా, నగదు రూపంలో సుమారు రూ.7 లక్షల వరకు తీసుకున్నట్లు భరత్ కుమార్‌కు తెలిసిన వారంతా తెలుసునని తెలిపారు. భరత్‌కు జరిగిన అన్యాయానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈప్రెస్‌మీట్‌లో భరత్ కుమార్ తల్లి శశిరేఖ కూడా పాల్గొని తమ కుటుంబం ఎదుర్కొంటున్న మానసిక, ఆర్థిక ఇబ్బందులను విలేకరులకు వివరించారు. సింగరేణిలో ఉద్యోగాల పేరుతో జరుగుతున్న ఇలాంటి అవినీతి, దళారీతనంపై కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశానికి వచ్చినవారుకోరి బాధితుడు భరత్ కుమార్‌కు వెంటనేన్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# అయ్యప్ప స్వాములకు టిఎన్జీఓ వారి అన్న సంతర్పణ



పెద్దపల్లిటౌన్. నవంబర్ 27(ఆకాంక్ష) : పెద్దపల్లిలోని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో పెద్దపల్లి టిఎన్జీఓ సంఘం అధ్యక్షుడు,ఉద్యోగ సంఘాల జే ఏ సీ చైర్మన్ బొంకూరి శంకర్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములందరికీ గురువారం అన్న సంతర్పణ (భిక్ష) కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు టీఎన్జీఓ నాయకులు పాల్గొని అయ్యప్ప స్వాములందరికీ భక్తి శ్రద్ధలతో వడ్డించడం జరిగింది. ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలా టిఎన్జీఓ తరపున ఒక రోజు అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములందరికీ అన్న సంతర్పణ చేయడం సంఘానికి సంప్రదాయంగా మారిందని, ఈ కార్యక్రమంతో ఆ అయ్యప్ప స్వామి కటాక్ష అనుగ్రహంతో పాటు , స్వాములందరి ఆశీస్సులు సంఘంపై సంవత్సర కాలం పాటు ఉండి పెద్దపల్లి జిల్లా ఉద్యోగులకు రక్షగా ఉంటుందని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పీ ఏ ఓ ప్రభాకర్, టీఎన్జీఓ కార్యదర్శి శ్రీపుక సత్యనారాయణ, ట్రెజరర్ ఆడెపు శ్రీనివాస్, సహాధ్యక్షులు శ్రీధర్, కొమురయ్య, టీఎన్జీఓ పట్టణ అధ్యక్షులు సందీప్ రెడ్డి, రామగుండం అధ్యక్షులు జగన్, మహిళా విభాగం అధ్యాకురాలు అనిత, సౌమ్య, శివ, శ్రీనివాస్, ప్రేమ్, సంతోష్, నిఖిల్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రాజి రెడ్డి,రాజాప్రసాద్ లు పాల్గొన్నారు.




# కూలిపోయినా బ్రిడ్జిలకు, చెక్ డ్యాములకు మాజీ మంత్రి హరీష్ రావే బాధ్యత వహించాలి

మంథని. నవంబర్ 27(ఆకాంక్ష) : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న మానేరు పై నాణ్యత లేకుండా నిర్మించిన బ్రిడ్జి, చెక్ డ్యాములు కూలిపోవడం పై మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావే బాధ్యత వహించాలని గురువారం మంథనిలో నిర్వహించిన మీడియా సమావేశంలో టిపిసిసి ఎన్నికల కమీషన్ కో ఆర్డినేషన్ కమీటి సభ్యుడు శశిభూషణ్ కాచే అన్నారు. మానేరుపై దాదాపు రూ. 300 వందలు కోట్లతో నిర్మించిన చెక్ డ్యాములు, ఓడేడు మానేరు పై నిర్మించిన బ్రిడ్జి గాలివానకే కొట్టుకు పోయింది నిజం కాదా అని బీఆర్ఎస్ నాయకులను కాచే ప్రశ్నించారు. మీ ప్రభుత్వంలో మీరే నీటి పారుదల శాఖ మంత్రి గా ఉండి నిర్మించిన కాళేశ్వరం బ్యారేజీ, చెక్ డ్యాములు, బ్రిడ్జిలు నాసిరకం తో నిర్మించి, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని హరీష్ రావును విమర్శించారు. అవినీతి కి పాల్పడి నాసరికంతో నిర్మించిన చెక్ డ్యాములపై విజిలెన్స్ అధికారులకు అలాగే రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డికి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశం లో మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు శంకర్, మంథని సురేష్, పర్షవేని మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు మాటాలను వక్రీకరిస్తే సహించం

## - స్థాయిని మించి మాట్లాడితే తగిన శాస్తి చెప్పక తప్పదు

## - రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని. నవంబర్ 27(ఆకాంక్ష) : మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేదా స్థానిక ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ సమాదానం చేప్పాలి కానీ స్థాయిని మించి మాజీ మంత్రి హరీష్ రావుపై పరుష పదజాలంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడి, హరీష్ రావు దిష్టి బోమ్మను దహనం చేయాడాన్ని రామగుండం మాజీ శాసన సభ్యులు పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ ఖండించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హరీష్ రావుని దూషించి దిషబోమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై గోదావరిఖని 1 టౌన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రామగుండానికి 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ కు 10 వేల 880 కోట్ల రూపాయలతో క్యాబినెట్ లో అమ్మెదం లభించడం విదితమేనని, ఎన్టీపీసీ 7 రూపాయలు ఒక యూనిట్ చోప్పున ప్లాంట్ నిర్మిసామంటే బయట మాకు 5 రూపాయలకే దోరుకుతుందని ప్లాంట్ నిర్మాణానికి 6 ఎళ్ల సమయం పడుతుందని అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం జరిగిందని అన్నారు. ఈ 10 వేల 880 కోట్ల రూపాయలతో ప్లాంటు నిర్మాణం అంటే ఒక్క యూనిట్ 8 రూపాయలు పడే అవకాశం ఉ ందని ఈ విషయం పై మాట్లాడినా మాజీ మంత్రి హరిష్ రావు దిష్టి బోమ్మను స్దానిక కాంగ్రెస్ నాయకులు దహనం చేయడం సరైంది కాదన్నారు. హరిష్ రావు దిష్టి బోమ్మ దహనం చేసిన వారిపై కేసు నమ్మెదు చేసి తగిన చర్యలు తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు కుమ్మరి శ్రీనివాస్ పాముకుంట్ల భాస్కర్ కల్వచర్ల కృష్ణ వేణీ బాదే అంజలి గాధం విజయ నాయకులు అచ్చె వేణు మేతుకు దేవరాజ్ నూతి తిరుపతి బోడ్డుపల్లి శ్రీనివాస్ నారాయణదాసు మారుతి జక్కుల తిరుపతి మేడి సదానందం ముద్దసాని సంధ్యా రెడ్డి తోకల రమేష్ సట్టు శ్రీనివాస్ బుర్ర శంకర్ బుర్రి వెంకటేష్ నీరటీ శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్ చింటూ బాలరాజు పద్మ రామరాజు తదితరులు పాల్గొన్నారు

# వంట సరిగ్గా చేయడం లేదని భార్యను పుట్టింట్లో వదిలేసిన భర్త

**- భార్య ప్రాణం తీసిన భర్త చేసిన అవమానకర మాటలు**

**- ఆత్మహత్యకు దారి తీసిన విషాదకర పరిణామం**

**- వికారాబాద్ జిల్లా మల్లెమోనిగూడెంలో ఘటన**



వికారాబాద్. నవంబర్ 27(ఆకాంక్ష) : వికారాబాద్ జిల్లా పరిగి మండలం మల్లెమోనిగూడెం గ్రామంలో చోటుచేసుకున్న కుటుంబ వివాదం చివరకు ప్రాణాంతకంగా మారింది. వంట సరిగ్గా చేయలేదన్న చిన్నపాటి కారణానికే భార్యను పుట్టింట్లో వదిలేసిన భర్త.. చివరకు ఆమె ఆత్మహత్యకు దారి తీసిన విషాదకర పరిణామం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పరిగికి చెందిన శివలింగం, ధరూర్ మండలం గడ్డమీద గంగారం గ్రామానికి చెందిన శిరీష(21)ల వివాహం కొన్ని సంవత్సరాల క్రితం జరిగింది. వివాహం ప్రారంభంలో బాగానే ఉన్న సంబంధం, కొద్ది కాలం గడవకుండానే చేజారిపోయింది. శిరీష చదువు తక్కువ అని, వంట సరిగా చేయలేదని శివలింగం తరచూ భర్తగా ఉండవలసిన బాధ్యతను పక్కనబెట్టి, ఆమెపై తీవ్ర వాగ్వాదాలు జరుపుతుండేవాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాలక్రమేణా వేధింపులు అధికమవుతుండడంతో శిరీష మానసికంగా తీవ్రంగా బాధపడేదని సన్నిహితులు తెలిపారు. దాంతో ఇటీవల ఒకరోజు శివలింగం, ఆమెను పుట్టింటికి తీసుకువచ్చి "కొంతకాలం ఇక్కడే ఉండు" అంటూ అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. మొదట దీనిని కుటుంబ సభ్యులు చిన్న కుటుంబ కలహంగానే భావించారు. కానీ శివలింగం వ్యవహారం రోజురోజుకూ దారుణంగా మారింది. పుట్టింట్లో ఉన్న శిరీషకు ప్రతిరోజూ భర్త ఫోన్ చేసి తీవ్ర అవమానాలు, దూషణలు చేస్తుండేవాడట. "నువ్వు నాకు అక్కర్లేదు%ొ% అక్కడే చావు" అని శివలింగం పలికిన మాటలు శిరీష మనసును బిత్తరపోయేలా చేశాయని కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త మాటలు తట్టుకోలేక పోయిన శిరీష తీవ్రమైన మనస్తాపానికి గురైంది. కుటుంబ సభ్యులు ఇంటి పనుల్లో బిజీగా ఉంటుండగా, శిరీష తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన వెంటనే కుటుంబ సభ్యులు ఆతురంగా ఆసుపత్రికి తరలించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాద వాతావరణాన్ని నెలకొల్పింది. ఆధునిక యుగంలో ఇటువంటి కారణాలతో ప్రాణాలు తీసుకోవడం బాధాకరమని గ్రామ పెద్దలు విచారం వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న ధరూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. శిరీష మరణానికి కారణమైన వేధింపులపై భర్త శివలింగంపై చర్యలు తీసుకునే దిశగా పోలీసులు చర్యలు చేపడుతున్నారు.తల్లిదండ్రులు "మా అమ్మాయి చదువు తక్కువే కావచ్చు%ొ% వంట చక్కగా రాకపోవచ్చు%ొ% కానీ ప్రాణం తీసుకునేంత తక్కువతనం ఆ పిల్లలో ఎప్పుడూ లేదు. మాటలు కూడా శిక్షలా మారుతాయని మా శిరీషతో జరిగినదే సాక్ష్యం" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మల్లెమోనిగూడెం గ్రామం నిండా శిరీష మృతిచెందిన విషయం విషాదాన్ని నింపింది. ఈ ఘటన మరోసారి కుటుంబ కలహాలు, ముఖ్యంగా చిన్న విషయాలకే భార్యలపై జరిగే అవమానాలు ఎంతటి మానసిక ఒత్తిడిని సృష్టిస్తాయో చాటి చెప్పింది. మహిళలపై మౌఖిక వేధింపులు, అవమానాలు కూడా ప్రాణాంతకంగా మారవచ్చని నిపుణులు హెచ్చరికలు పలుకుతున్నారు.

# ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో మెరిసిన ఇందుర్తి ఎంఫస్సీ విద్యార్థి అజయ్

**- ప్రభుత్వ పాఠశాల ప్రతిభకు నిలువుటద్దం**

**- ఉపాధ్యాయుల కృషికి ఫలితమే విజయాల హారం**




ENGLISH LANGUAGE TEACHERS ASSOCIATION, TELANGANA
MANDAL LEVEL EDUQUEST TALK COMPETITION
Certificate of Appreciation
This certificate of appreciation is presented to
Master / Baby V. Ajay
of 7th Class, Studying at MPUPS- Indurthy of
Odela Mandal Peddapally District for achieving first / second position in
"Mandal Level EduQuest Talk Competition" held in
Odela Mandal on 27 November 2025, organised by
ELTA Telangana in Collaboration with TGSCERT & Bharti Airtel Foundation.
Mandal Co-ordinator — Mandal Convener — District President, ELTA

ఓదెల.నవంబర్ 27(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాలలో ఎవరికీ తీసిపోరని మరోసారి రుజువైంది. మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, ఇందుర్తికి చెందిన 7వ తరగతి విద్యార్థి వట్టె అజయ్ మండల స్థాయి ఎల్టా ఒలింపియాడ్ %ఽ% ఏడుక్వెస్ట్ కాంపిటీషన్స్ లో జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి మెరిసాడు.ఓదెలలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని అనేక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీ పడ్డారు.

**ప్రభుత్వ పాఠశాలల ప్రతిభకు అజయ్ విజయం నిదర్శనం...**

ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా పోటీ పడి, అజయ్ సాధించిన ఈ విజయంతో ప్రభుత్వ విద్యా వాతావరణం, ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థులపై చూపించే వ్యక్తిగత శ్రద్ధ ఎంత బలంగా ఉందో స్పష్టమైంది.పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న క్రమ శిక్షణాత్మక బోధన, ప్రత్యేక శ్రద్ధ, అదనపు మార్గదర్శకత అజయ్ విజయం వెనుక ఉన్న ప్రధాన శక్తి అని పాఠశాల వర్గాలు అభిప్రాయ పడ్డాయి.ఈ సందర్భంగా మండల విద్యాధికారి వై. రమేష్ అజయ్‌ను అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని అందించారు.అజయ్ ప్రతిభను కొనియాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా సరైన మార్గ దర్శకతతో దేశ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించగలరన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు బి. శ్రీనివాస్, ఎండీ. యూసఫ్ జానీ, ఎం. కుమారస్వామి, ఎం. సంధ్య అజయ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.వారి కృషి,పర్యవేక్షణ అజయ్ వంటి ప్రతిభావంతుల ఎదుగుదలకు బలం అవుతోందని పేర్కొన్నారు. అలాగే డిసెంబర్‌లో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో అజయ్ పాల్గొననున్నట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.ఈ విజయం అజయ్‌కు మాత్రమే కాకుండా, మొత్తం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమైందన్నారు. శ్రద్ధగా చదివితే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని అజయ్ నిరూపించినట్లు పలువురు పేర్కొన్నారు.

# ఎంపీ వంశీ కృష్ణను అవమాన పరిచిన అధికారులను సస్పెండ్ చెయ్యాలి

**- ప్రజా ప్రతినిధుల విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది**

**- సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబాసి మల్లేష్**

గోదావరిఖని.నవంబర్27(ఆకాంక్ష) : కార్మికుల నిండుకొండగా నిలిచిన రామగుండం ప్రాంతానికి ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం ఎంతో కీలకమైందని, పార్లమెంటులో ఘనమెత్తి ఈఎస్ఐ ఆసుపత్రిని సాధించుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్థల పరిశీలన కోసం వచ్చిన సమయంలో, అధికారుల నిర్లక్ష్యం అవమానకర ప్రవర్తన తీవ్ర విమర్శలకు దారి తీసిందని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబాసి మల్లేష్ అన్నారు. ప్రజా ప్రతినిధి గౌరవాన్ని ధ్వంసం చేస్తూ అధికారుల ప్రవర్తించిన తీరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దళిత వర్గాలలో తీవ్ర ఆగ్రహాన్ని రగల్చిందని పేర్కొన్నారు.రామగుండం కార్మిక ప్రాంతంలో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం వలన లక్షలాది కార్మికులు, కూలీలు, కుటుంబాలు ఆరోగ్య పరిరక్షణలో పెద్ద మేలును పొందబోతున్న పరిస్థితుల్లో ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని ముందుకు తెచ్చిన ఎంపీని అవమానించడం ప్రజాస్వామ్యానికి అవమానం అని నాయకులు మండిపడ్డారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ, కాక కుటుంబం సేవలు ప్రజలకు స్ఫూర్తి అని పేర్కొంటూ, అలాంటి నాయకునికి కుటుంబం నుండి వచ్చిన తనయునికి జరిగిన అవమానం ఒప్పుకోలేనిదని తెలిపారు.పార్లమెంటు పరిధిలోని దళితులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఈ సంఘటనను తట్టుకోలేక బాధ, ఆగ్రహంతో ఉన్నారని దుబాసి మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు.దళిత గౌరవానికి నెపం తగిలే విధంగా వ్యవహరిం చిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో శ్రమించి విజయం సాధించిన నాయకుని అవమానించే అధికారులకు కాంగ్రెస్ లో చోటు లేదని మల్లేష్ ఖండించారు. అధికారుల ఇలాంటి దుశ్చర్యల వలన దళితులు కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ప్రభుత్వానికి స్పష్టంగా సందేశం పంపించారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని, కాంగ్రెస్ పార్టీకి నష్టం చేస్తోన్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. ఎంపీ వంశీకృష్ణకు మరల అవమానం జరిగితే తిరుగుబాటు తప్పదని, దళితుల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. దళితుల గౌరవం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజా ప్రతినిధుల విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అని, పార్టీ బలోపేతం కోసం తక్షణ చర్యలు అవసరం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబాసి మల్లేష్ ఒక్క ప్రకటనలో హెచ్చరించారు.



# ఘనంగా "వందేమాతరం"150 ఏళ్ల వేడుకలు...






పెద్దపల్లిటౌన్. నవంబర్ 27(ఆకాంక్ష) : జాతీయ చైతన్యానికి నాంది పలికిన అజరామరం గేయం "వందేమాతరం" పుట్టి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జండా చౌరస్తాలో గురువారం ప్రత్యేక వేడుకలు నిర్విఘ్నంగా జరిగాయి. ప్రోగ్రాం అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ స్కూళ్లు, కళాశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు సమూహంగా "వందేమాతరం" గీతాన్ని ఆలపించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇన్చార్జ్ దుగ్యాల ప్రదీప్ కుమార్,బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... 1875లో బంకించంద్ర ఛటర్జీ రచించిన "వందేమాతరం" దేశభక్తి, సంస్కృతి, ఆధ్యాత్మికతను ఒకే రాగంలో మేళవించిన అపూర్వ గేయమని తెలిపారు. 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ కాంగ్రెస్ మహాసభలో తొలిసారి ఈ గీతాన్ని పాడగా, 1905 బెంగాల్ విభజన ఉద్యమంలో ఇది దేశవ్యాప్తంగా పోరాట నినాదంగా మారిందని గుర్తు చేశారు. "వందేమాతరం" స్వాతంత్ర్య సమరానికి హృదయస్పందనగా, ప్రజలను ఐక్యపరిచిన శక్తివంతమైన గేయమని పేర్కొన్నారు.స్వదేశీ ఉద్యమం నుంచి స్వాతంత్ర్య సమరం వరకు విద్యార్థులు, మహిళలు, కూలీలు, రైతులు "వందే మాతరం" నినదిస్తూ బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి నిలిచిన చరిత్రను వివరించారు. బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయులకు ఇది స్ఫూర్తి మూలమైందన్నారు. అనేక స్వాతంత్ర్య సమర యోధుల చివరి నినాదం కూడా "వందేమాతరం"నేనని చెప్పారు.బ్రిటిష్ ప్రభుత్వం ఈ నినాదాన్ని నిషేధించడానికి ప్రయత్నించినప్పటికీ ఇది దేశభావనను చెరగని అక్షరాలా నిలబెట్టిందని పేర్కొన్నారు. అనంతరం 1947 స్వాతంత్యం అనంతరం ఆకాశవాణిలో మొదటగా వినిపించిన గేయం కూడా ఇదేనని, 1950లో రాజ్యాంగ పరిషత్తు దీనికి జాతీయ గీతం తరహా సమాన హోదా ఇచ్చిందని గుర్తుచేశారు.దేశ సంస్కృతి, విలువలు, ఆత్మను ప్రతిబింబించే గీతం ఇదేనని, యువతలో దేశభక్తి,సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు "వందేమాతరం" మరింత స్ఫూర్తి దాయకమవుతుందని నాయకులు పేర్కొన్నారు. భారతీయతకు ప్రతీకగా నిలిచిన ఈ గేయం 150 ఏళ్ల వేడుకలు దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి సంకేతమని అన్నారు.ఈ కార్యక్రమంలో శిలారం పర్వతాలు, సోమారపు లావణ్య, కోమల్ల మహేష్, తంగేడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, నల్ల మనోహర్ రెడ్డి, కాసిపేట శివాజీ, మహేందర్ యాదవ్, పింజర్ల రాకేష్, వేల్పుల రమేష్, కారంగుల శ్రీనివాస్, చిలువేరు సంపత్, వొల్లె తిరుపతి, ఈర్ల శంకర్, మేకల శ్రీనివాస్, కావేటి రాజగోపాల్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఉప్పు కిరణ్, గుడ్ల సతీష్, సురేందర్, ముంజ రాజేందర్, గాదాసి సతీష్, యూ. సాయి కుమార్, బండి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నాట్యాచార్యులు భారతి, సరిత లకు ఉత్తమ సాంస్కృతిక నాట్య సేవ పురస్కారము



బాసర నవంబర్ 27(ఆకాంక్ష) : శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపములో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము ) మాసో త్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమములు, అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగినవి.. సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గణించిన జగ్గయ్య పేట వాస్తవ్యులుశ్రీ త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు నాట్యాచార్యులు భారతికి హైదరాబాద్ వాస్తవ్యులు అపరాజిత నాట్య గురుకుల వ్యవస్థాపక అధ్యక్షులు సరితశ్రీ లకు ఉత్తమ ఆధ్యాత్మిక సాంస్కృతిక నాట్య సేవ పురస్కార ప్రదానోత్సవం ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికా నాథ శర్మ సంధ్య దంపతులు అందజేశారు. ప్రతి నెల మూడవ ఆదివారము మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమంలో భాగంగా ఉచితముగా ఎలాటి ఎంట్రీ ఫీ తీసుకోకుండా నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నామని ఆసక్తి గల నాట్య గురువులు తమ పిల్లల చేత నృత్య ప్రదర్శన చేయించదలచిన వారు 9948332032 సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవలసినది గా శర్మ కోరారు

# కార్మికుల హక్కులకు బీఎంఎస్ బలమే

## షరతులతో కూడిన సర్క్యులర్ ఉపసంహరణకు డిమాండ్..



గోదావరిఖని, నవంబర్ 27(ఆకాంక్ష) : సింగరేణి కార్మికుల జీవన విధానాన్ని అర్థం చేసుకోని, కార్మిక వ్యతిరేకంగా వ్యవహరిస్తూ జారీ చేసిన షరతులతో కూడిన విధులకు హాజరు సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ రామగుండం ఏరియా%-×% ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య గట్టిగా డిమాండ్ చేశారు. సాయంత్రం గోదావరిఖని బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రసంగించిన ఆయన..బొగ్గు గనుల్లో పని చేసే కార్మికులు ప్రకృతికి విరుద్ధంగా, ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారు. వారి కష్టాలు, ప్రమాదాలతో నిండిన సేవలు దేశ సైన్యంతో సమానమైనవే. అలాంటి కార్మికుల బతుకులకు ప్రభుత్వాలు, యాజమాన్యాలు గ్యారెంటీవారంటీ ఇవ్వలేకపోతున్న సమయంలో, కొత్తగా షరతులతో కూడిన సర్క్యులర్లు జారీ చేయడం అనేది పూర్తిగా అన్యాయం” అని మండిపడ్డారు.కార్మికులకు ఇలాంటి ఒత్తిడిమీద ఆధార పడే నిబంధనలు మానవతా విరుద్ధం అని, వెంటనే యాజమాన్యం పునరాలోచించి సర్క్యులర్‌ను ఉపసంహరించకపోతే బీఎంఎస్ బలమైన ఉద్యమానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల జీవన విధానం ప్రమాదాలతో నిండిపోయి ఉన్నందున, వారికి మరింత రక్షణ, సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ కార్యక్రమాలకు ఆకర్షితులై రామగుండం ఏరియా%-×, జ్యూా-%1 కి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ మేడ అజయ్ కుమార్ ను యూనియన్ శ్రేణులు కండువాతో ఆహ్వానించారు. అజయ్ కుమార్ చేరికతో బీఎంఎస్ శక్తి మరింత బలోపేతం అవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కర్రావుల మహేష్ ఏరియా ఉపాధ్యక్షులు, పల్లె రవికుమార్ పిట్ కార్యదర్శి, చెన్న సతీష్ పిట్ కార్యదర్శి, గోలి మోహన్, కే. ప్రసన్న కుమార్ మరియు ఇతర యూనియన్ నేతలు పాల్గొన్నారు. సమావేశంలో యూనియన్ ఐకమత్యంతో ముందుకు సాగుతూ కార్మిక హక్కుల కోసం పోరాటాన్ని మరింత దృఢంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో కర్రావుల మహేష్ ఏరియా ఉపాధ్యక్షులు సాయవేణి సతీష్ %-% ఏరియా కార్యదర్శి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

### - పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష






పెద్దపల్లిబ్యూరో.నవంబర్-27(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని మహిళలు ప్రభుత్వం అందించే సహకారాలను అందుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఔత్సాహిక మహిళ పారిశ్రామిక వేత్తల అవగాహన సమావేశంలో హాజరైన మహిళలకు పిలుపునిచ్చారు. మహిళల పారిశ్రామిక అభివృద్ధిపై వీ హబ్ మరియు సర్ఫ్ సంస్థ సంయుక్తంగా జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. మహిళలు వ్యాపార రంగంలో ఎదిగి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు కావాలని కలెక్టర్ సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, వీలైనంత మేరకు వివిధ రంగాలలో మహిళలకు అవకాశం కల్పించేందుకు బాటలు వేస్తుందని అన్నారు. వీ హబ్ ద్వారా కాలేజీల్లో చదువుతున్న బాలికలకు విద్య తర్వాత ఉపాధి అవకాశాలు పొందేలా అవసరమైన నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మహిళలు ఉద్యోగాలపై మాత్రమే కాకుండా నూతనంగా వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన అవగాహన కల్పించామని అన్నారు.వీ హబ్ ద్వారా అందించే అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వీ హబ్ రీజినల్ సెంటర్ త్వరలో పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేయడం జరుగుతుందని దీనిలో జిల్లాలోని మహిళలందరూ రిజిస్టర్ అయి నూతన కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లాలోని మదర్ థెరిస్సా , ట్రినిటీ, మరియు జెఎన్టియు మంథని కళాశాలకు, సంబంధించిన విద్యార్థిని, విద్యార్థులతోపాటు స్వశక్తి సంఘాల మహిళలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలు తగిలి లారీకి అంటుకున్న మంటలు



రంగారెడ్డి.నవంబర్ 27 (ఆకాంక్ష) : విద్యుత్ తీగలు తగిలి లారీకి మంటలు అంటుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం కొడిచెర్ల గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. స్థానికుల కథనం ప్రకారం పెంజర్ల గ్రామం నుంచి మహేశ్వరం మండలం నాగారం గ్రామనికి గడ్డిని లారీలో తరలిస్తుండగా విద్యుత్ తీగలు లారీకి తగిలి మంటలు అంటుకున్నాయి. అది గమనించకుండా లారీ డ్రైవర్ కొంచెం దూరం అలానే వెళ్లాడు. స్థానికులు తెలపడంతో లారీ డ్రైవర్ లారీని పక్కనే ఉన్న పంటపొలాల్లోకి తీసుకెళ్లి ఆపాడు. మంటలు ఎక్కువ కావడంతో లారీని దగ్గరలో ఉన్న ఫామ్ హౌస్ వద్దకు తీసుకెళ్లి నీళ్లతో మంటలను ఆర్పాడు. ఈ ఘటనలో లారీ వెనుక భాగం పూర్తిగా కాలిపోయింది. రోడ్డుపై గడ్డి కట్టలు పడడంతో అందులోంచి వంచిన పోగతో వాహదారులు తీవ్ర ఇబ్బందికి గురైనారు.

# పోలీసులు అదుపులోనే తిప్పిరి అలియాస్ దేవ్‌జీ



ఆకాంక్ష డెస్క్ : తిప్పిరి అలియాస్ దేవ్‌జీ పోలీసుల అదుపులోనే ఉన్నాడని, ఆయన అదృశ్యంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. దేవ్‌జీతో పాటు మరో 50 మంది మావోయిస్టులను రహస్యంగా అరెస్టు చేసినట్టు ఆరోపిస్తూ, వెంటనే దేవ్‌జీని కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు.విడుదల చేసిన లేఖలో, ఇటీవల హిడ్మాతో జరిగిన ఎన్‌కౌంటర్ పూర్తిగా బూటకమని, ఆయనను ముందుగానే అరెస్టు చేసి అనంతరం కాల్చి చంపారని మావోయిస్టులు తీవ్రంగా విమర్శించారు. పోలీసుల ఎన్‌కౌంటర్ కథనం పూర్తిగా కల్పితమైందని, నిజాలను ప్రజల నుంచి దాచిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.హిడ్మా హత్యకు నిరసనగా ఈ నెల 30న బంద్ పాటించాలని ప్రజలకు పిలుపునిస్తూ, తమ కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ అరెస్టులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అడవిప్రాంతాల్లో జరుగుతున్న కాంబింగ్ చర్యలను విరమించాలని, నిరపరాధ గ్రామస్థులను వేధించడం మానుకోవాలని మావోయిస్టులు ప్రభుత్వాన్ని కోరారు.ఈ లేఖ వెలుగులోకి రావడంతో భద్రతా వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. 30వ తేదీ బంద్ నేపథ్యంలో పోలీసు విభాగం ఇప్పటికే సన్నద్ధత చర్యలు ప్రారంభించినట్లు సమాచారం.

# ఉత్సాహంగా దివ్యాంగుల ఆటల పోటీలు

### - పోటీలను ప్రారంభించిన కలెక్టర్

కరీంనగర్, నవంబర్ 26 : మహిళలు, పిల్లలు, వికలాంగులు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు కరీంనగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈ కార్యక్రమానికి హాజరై పలు ఆటల పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందజేశారు. చెస్, క్యారం, రన్నింగ్, షార్ట్ పుట్, జావలిన్ త్రో వంటి పోటీల్లో విభాగాల వారీగా అంధులు, బధిరులు, శారీరక, మానసిక దివ్యాంగులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల మానసిక వికాసానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి మాట్లాడుతూ వచ్చేనెల మూడవ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు.

# భవిత శ్రీ చిట్ తో బతుకులు ఆగమాగం...

### - చిట్ ఫండ్ పేరుతో వందల కోట్ల రూపాయలు గోల్ మాల్

### - ఒక్కొక్కరిగా బయటకు వస్తున్న చిట్ ఫండ్ బాధితులు

కాటారం,నవంబర్ 27(ఆకాంక్ష) : ఒకప్పుడు విస్తృత స్థాయిలో సేవలు అందిస్తున్నామని నమ్మబలికి, బ్రాంచ్ కార్యాలయాల పేరుతో డిపాజిటర్ల వద్ద డబ్బులు వసూలు చేసిన భవిత శ్రీ చిట్స్ యాజమాన్యం అసలు రంగు బయటపడుతోంది.యాజమాన్యం అకస్మాత్తుగా బ్రాంచ్ కార్యాలయాలను మూసి వేయడంతో, చిట్ సభ్యులు ఒక్కొక్కరుగా మోస పోయామని ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో తాజగా కాటారం పోలీస్ స్టేషన్‌లో మరో ఫిర్యాదు నమోదు అయింది.వివరాల్లోకి వెళ్తే... పెంట రజని అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... తాను 2022 నవంబర్ వరకు రూ.5 లక్షల చిట్‌లో సభ్యురాలిగా ఉండి, ప్రతినెల చెల్లింపులు చేసింది. అయితే 2022 డిసెంబర్ నెల్లో కాటారం బ్రాంచ్ కార్యాలయానికి వెళ్లగా ఆఫీసు తొలగించారని తెలిసింది. దీంతో హన్మకొండ మెయిన్ బ్రాంచ్‌ను ఆశ్రయించగా అక్కడి సిబ్బంది “రూ.2.38 లక్షలు మీకు రావాల్సి ఉంది” అంటూ చేతిరాత నోటు ఇచ్చారని పేర్కొన్నారు.అయితే పలుమార్లు హన్మకొండ బ్రాంచ్‌ను ఆశ్రయించినప్పటికీ డబ్బులు ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ చివరకు బెదిరించేందుకు పూనుకున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో వివరించారు. దీంతో ఆమె కాటారం పోలీసులను ఆశ్రయించగా భవిత శ్రీ చిట్స్ ఛైర్మన్ గుండా ప్రకాష్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ తాటిపల్లి శ్రీనివాస్, ఈడీ నాగరాజులపై పోలీసులు కేసు నమోదు చేశారు.చిట్ సంస్థల నిబంధనల ప్రకారంచిట్ ఫండ్ లిమిటెడ్‌గా అనుమతులు పొందిన సంస్థ ఎక్కడైనా బ్రాంచ్ ప్రారంభించవచ్చు. అయితే ఆ బ్రాంచ్ పరిధిలో చేర్చుకున్న సభ్యుల వివరాలు, చిట్ విలువ, ప్రతి చిట్‌కు సంబంధించిన పూర్తి డిపాజిట్ డేటాను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒక బ్రాంచ్‌ను మూసివేయాలంటే, ఆ బ్రాంచ్ ద్వారా నడుస్తున్న చిట్స్ పూర్తిగా సెటిల్ చేశామనే పూర్తి రికార్డులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఇవ్వాలి. అనుమతి వచ్చిన తరువాతే బ్రాంచ్‌ను పూర్తిగా తొలగించేందుకు అవకాశం ఉంటుంది.కానీ కాటారం బ్రాంచ్ తొలగించిన తరువాత కూడా సభ్యులు మోస పోయామని ముందుకు వస్తుండటంతో అసలు ఏం జరిగిందో అనుమానాలు తలెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సరైన రికార్డులు సమర్పించారా? లేక అధికారులను తప్పుదారి పట్టించారా? అనే అంశంపై విచారణ జరగాల్సిన అవసరం ఉన్నట్లు తెలుస్తోంది.అంతేకాకుప్రతి చిట్ విలువ మేరకు డిపాజిట్లు చేసినట్టయితే వాటిని విక్రయించి బాధితులకు డబ్బులు చెల్లించే అవకాశం ఉంటుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా చిట్స్ నిర్వహించినట్టయితే చిట్ యాజమాన్యంపై అదనపు కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా చిట్ డబ్బుల బదులుగా ప్లాట్లు ఇస్తామని నమ్మ బలకడం కూడా నిబంధనలకు వ్యతిరేకమే కావడంతో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.బ్రాంచ్ కార్యాలయాలు మూసిన తరువాత కూడా బాధితులు బయటకు వస్తుండటం%ొ% భవిత శ్రీ చిట్స్ వ్యవహారంపై భారీ అనుమానాలను రేకెత్తిస్తోంది. విచారణలో అసలు నిజాలు వెలుగులోకి రావాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.







**మీడియా పేరుతో సొంత ప్రచారం చేసుకుంటూ హల్చల్..**

భవిత శ్రీ చిట్ ఫండ్ లో చిట్టీలు వేసిన బాధితులకు సమయానికి డబ్బులు చెల్లించకుండా యాజమాన్యం దుబారా ఖర్చులకు పాల్పడినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో మీడియా పేరుతో వివిధ పేర్లతో మూడు యూట్యూబ్ ఛానల్ లను ప్రారంభించి తమకు సొంతం మీడియా ఛానళ్లను ప్రారంభించినట్లు గొప్పలు చెప్పుకొని ఎంతసేపు భజన కార్యక్రమాలను చేస్తూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఇదే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా భవిత శ్రీ యాజమాన్యం యాగాలు హెూమాల పేరుతో లక్షల కోట్ల రూపాయల దుబారకర్చు చేసి చిట్ ఫండ్ లో చిట్టిలు వేసిన బాధితులను మోసం చేసిందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికే భవిత శ్రీ చిట్ ఫండ్ వందల కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తి వివరాలను అధికారులు చిట్ ఫండ్ యాజమాన్యం నుండి రికార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తే పెద్ద ఎత్తున అక్రమాలు బయట పడతాయనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఈ దిశగా అడుగులు వేయాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

# మెడికల్ బోర్డు నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీబీజీకేఎస్



(ఆకాంక్ష న్యూస్)

గోదావరిఖని టౌన్, నవంబర్ 27 : తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ విధులు నిర్వహించలేని కార్మికులను మెడికల్ బోర్డు ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అంటూ పేర్కొనడం అమానవీయమని, అవకతవకలకు నిదర్శనమని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ధ్వజమెత్తారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తితో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డులో గత సంవత్సరం ఏప్రిల్ నెల నుండి నేటి వరకు దాదాపు సంవత్సరంన్నర కాలంగా అనారోగ్యంతో విధులు నిర్వహించలేక, జీతాలులేక, సగం వేతనం కూడా రాకుండా ఉన్న 129 మంది కార్మికులకు మెడికల్ బోర్డు నిర్వహించి, అందులో 25 మందిని మాత్రమే మెడికల్ అన్ ఫిట్ చేసి, 13 మందికి తిరిగి ఫిట్ ఫర్ సేమ్ జాబ్ ఇచ్చారని ఆరోపించారు. మెడికల్ బోర్డుకు రెఫర్ చేయబడిన వారంతా దీర్ఘకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో ఉన్నారని, సింగరేణి యాజమాన్యం, వైద్యులు అడ్వైజ్ మెడికల్ బోర్డుకు, హయ్యర్ సెంటర్ కు రెఫర్ చేయబడిన వారేనని అన్నారు. అందులో ఒకరు కృత్రిమ కాలుతో, కొందరు గుండెకు, మెదడులో నరాలకు స్టంట్ వేయబడిన వారని, పక్షవాతంతో ఉన్న వారని, అధిక షుగర్, బీపీ మూలంగా వైద్యులు సర్జరీకి నిరాకరించిన వారికి సైతం ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అని ఇవ్వడం దారుణమన్నారు. గని ప్రమాదానికి గురైన వారికి సర్ఫేస్ లో కొంతకాలం విధులు నిర్వహించడానికి అవకాశమిచ్చి మెడికల్ బోర్డుకు పంపకుండా తిరిగి ఇప్పుడు ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అంటూ గతంలోని విధులు నిర్వహించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. 36 మంది సర్ఫేస్ లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తిరిగి సర్ఫేస్ అనే ఇచ్చారని విమర్శించారు. 16 నెలల సర్వీస్ ఉన్నవారు వందల్లో, రెండు సంవత్సరాల సర్వీస్ ఉన్నవారు సుమారు వెయ్యి మంది వరకూ ఉన్నారని, వారికి మెడికల్ బోర్డు ఎప్పుడు నిర్వహిస్తారని ప్రశ్నించారు. మైనింగ్ స్టాఫ్ కు సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నామని జబ్బలు చరుచుకున్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ఆ మైనింగ్ స్టాఫ్ లోని వారికి సైతం సర్ఫేస్ లో జనరల్ మజ్దూర్ గా ఇవ్వడంపై ఏం సమాధానం చెప్తారన్నారు. మెడికల్ బోర్డు పేరుతో కార్మికులకు అన్యాయం చేయడాన్ని టిబిజికేఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రెగ్యులర్ మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం చెప్పేదొకటి చేసేదొకటని, కార్మికులకు న్యాయం కోసం ప్రభుత్వంపై, యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన నిర్ణయం తీసుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, నాయకులు నూనె కొమరయ్య, బండి రమేష్, పర్లపల్లి రవి, పోలాడి శ్రీనివాస్, చెలుకలపల్లి శ్రీనివాస్, వడ్డెపల్లి శంకర్, చెల్పూరి సతీష్, మీనుగు సురేష్, అబ్బు శ్రీనివాసరెడ్డి, పొగాకుల రమేష్, వాసర్ల జోసెఫ్, రెహమాన్, వేణు, పులిపాక శంకర్, అన్వేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మక్బూద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ఫేస్ జాబ్ ఆశించి మోసపోయాను

## - బాధితుడు నీరుడు భరత్ కుమార్

(ఆకాంక్ష న్యూస్)



గోదావరిఖని టౌన్, నవంబర్ 27 : సర్ఫేస్ జాబ్ కోసం ఉదుత నాగరాజు అనే దళారీని నమ్మి దాదాపు 10 లక్షల రూపాయల మేర నష్టపోయానని బాధితుడు నీరుడు భరత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగనామ స్వప్నతో కలిసి సర్ఫేస్ జాబ్ ఆశించిన విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని భరత్ కుమార్ వివరించారు. తాను 2022లో సింగరేణి ఉద్యోగంలో చేరానని, జీడీకే 2ఏ ఇంక్లైన్ లో పని చేస్తున్న తనకు బయట ప్రమాదం జరగడంతో.. తనకు సర్ఫేస్ జాబ్ కావాలని ఉదుత నాగరాజు అనే వ్యక్తిని ఆగస్ట్ 13, 2024 లో సంప్రదించానన్నారు. అందుకు అతను కొంత డబ్బును అడగగా అందులో లక్షా యాభై వేలు తనకు తెలిసిన వ్యక్తి ఫోన్ నుండి ఆన్ లైన్ ద్వారా, మరికొంత డబ్బును నగదు రూపంలో ఇవ్వడం జరిగిందని వెల్లడించాడు. కానీ ఇప్పటికీ సంవత్సరం గడిచినా కూడా తనకు సర్ఫేస్ జాబ్ ఇప్పించకపోవడంతో సదరు వ్యక్తిని నిలదీయగా తన డబ్బులు తనకు ఇస్తానని డ్యూటీలో చేరాలని సమాధానం ఇస్తున్నారని తెలిపాడు. తాను ఫిట్ ఫర్ జాబ్ అని తీసుకొని డ్యూటీలో చేరితే మళ్ళీ అండర్ గ్రౌండ్ లో పని చేయాల్సి వస్తుందని, ఇంతకాలం తాను డ్యూటీ చేయకుండా దీపావళి బోనస్, దసరా అడ్వాన్స్, జీతం రూపంలో 10 లక్షల రూపాయల వరకు నష్టపోవడం జరిగిందన్నారు. ఈ విషయమై తాను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు తేదీకన్నా ముందే డబ్బులు ఫోన్ ద్వారా ఆన్ లైన్లో పంపిన వ్యక్తికి తిరిగి చెల్లించినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపించాడు. జగనామ స్వప్న మాట్లాడుతూ ఐఎన్టీయూసీ నాయకుడు ధర్మపురి అనుచరుడిగా ఉన్న ఉదుత నాగరాజు నిర్వాకం మూలంగా భరత్ కుమార్ అన్ని విధాలుగా నష్టపోవడం జరిగిందని ఆరోపించారు. ఆన్లైన్ రూపంలో లక్షా యాభై వేల రూపాయలకు మాత్రమే ఆధారాలు ఉన్నాయని, ఇంకా దాదాపు 7 లక్షల రూపాయల మేర ధర్మపురి వెనకాల ఉండి ఉదుత నాగరాజు ద్వారా భరత్ కుమార్ నుండి తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. భరత్ కుమార్ కు న్యాయం జరగాలని కోరుకున్నారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో భరత్ కుమార్ తల్లి శశిరేఖ ఉన్నారు.

# మాహా జాతరను విజయవంతం చేద్దాం

## - చెడు వ్యసనాల అలవాట్లపై అవగాహన సదస్సులు
## - పశువుల అక్రమ రవాణాలను నిలిపివేస్తాం - జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్



(ఆకాంక్ష న్యూస్)

ములుగు, నవంబర్ 27 : జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మహా మేడారం జాతరను పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, జిల్లా యంత్రాంగంతో కలిసి సమన్వయంగా విజయవంతం చేద్దామని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. గత జాతర సందర్భంగా జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అందరితో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పాత్రికేయులతో సమన్వయ కమిటీ సమావేశం ఓ ఎస్ డి శివం ఉపాధ్యాయ, డి.ఎస్.పి రవీందర్ లతో కలిసి ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న మహా జాతరకు కోటి 50 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడానికి పదివేల మంది పోలీస్ సిబ్బంది నియమిస్తున్నామని, మేడారంలోని అమ్మవార్ల గద్దల వద్ద మాస్టర్ ప్లాన్ తో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడానికి అందరికీ ఒకే నిబంధనలు ఉంటాయని, 99 శాతం ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుందామని తెలిపారు. గతంలో జాతర సందర్భంగా పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నానని, భక్తులకు ఇబ్బంది కలగకుండా అమ్మవార్లను దర్శించుకోవడానికి గతంలో ఉన్న క్యూలైన్లకు అదనంగా మరో ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. 8 క్యూ లైన్ ల ద్వారా భక్తులను అమ్మవార్ల దర్శనం కోసం అనుమతించి మూడు గేట్ల ద్వారా బయటికి పంపించడం జరుగుతుందని, జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకునే నిర్ణయాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయబోతున్నామని, ప్రత్యేక నినాదంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా భక్తులకు వివరించడం జరుగుతుందని అన్నారు. జాతర సందర్భంగా ఇతర సమయాలలో పలు రకాల వాహనాలు వేగంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ములుగు జిల్లాలో గంజాయి అమ్మకాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయబోతున్నామని, చెడు వ్యసనాలపై యువకులకు అవగాహన కలిగించడానికి కళాబృందాలచే అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. అక్రమంగా ఇసుక, ఎర్ర మట్టి, ఇతర వస్తువులను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని, పలు రకాల పశువులు జాతీయ రహదారిపై రాకుండా వాటికి సంబంధించిన యజమానులకు ముందు సమాచారం అందించి వినని పక్షంలో పశువులను గోశాలకు తరలిస్తామని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ములుగు జిల్లాలో పలు రకాల పనులు చేయడానికి వచ్చిన సందర్భంలో వారి వివరాలను పూర్తిగా సేకరించాలని, దీంతో పలు సంఘటనలు చోటు చేసుకోకుండా అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మేడారం జాతర సందర్భంగా పాత్రికేయులు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడానికి ఆలోచిస్తామని, జాతర విషయంలో పాత్రికేయులు సహకరించాలని కోరారు. ఎలాంటి సంఘటనలు జరిగిన తన దృష్టి కానీ ఇతర అధికారులు దృష్టి గానీ తీసుకపోవాలని, ప్రతి విషయాన్ని భూతద్దంలో చూపించకుండా సమస్య పరిష్కారం కోసం పాత్రికేయులు సూచనలు సలహాలు ఇవ్వాలని అన్నారు.

# అవినీతికి పాల్పడుతున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

## - సహకరిస్తున్న ఎంఇఓ, డిఈఓలను సస్పెండ్ చేయాలి - ప్రజాసంఘాలు డిమాండ్



(ఆకాంక్ష న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 27 : అవినీతికి పాల్పడుతున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, అలాగే ప్రిన్సిపాల్‌కు సహకరిస్తున్న ఎంఇఓ, డిఈఓలను సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేసాయి. ఈ మేరకు బుధవారం మల్హర్‌రావు మండలం ఎడ్ల పెల్లి గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్‌ను ప్రజా సంఘాలు సందర్శించాయి. అనంతరం మోడల్ స్కూల్‌లో జరిగిన పీఎం శ్రీ నిధులుపై ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ డెవలప్‌మెంట్ కొరకు పిఎమ్ శ్రీ నిధులు 21లక్ష ల రూపాయలు మంజూరు అయ్యాయని, పాఠశాలలో ఏలాంటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టకుండా తప్పుడు లెక్కలు చూపించి స్థానిక రాజకీయ నాయకుల అండతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ 21 లక్షల రూపాయలు ప్రభుత్వ నిధులు స్వాహాచేయశాడని ప్రజాసంఘాలు ఆరోపించారు అంతేగాకుండా మోడల్ స్కూల్‌లో నైట్ వాచ్ మెన్ డ్యూటీ చేయకుండా వాచ్‌మెన్ పేరు మీద వచ్చిన జీతాన్ని సైతం ప్రిన్సిపాల్ తీసుకొని సొంతానికి వాడు కొంటున్నాడనీ, అలాగే మోడ ల్ స్కూల్‌లో రెగ్యులర్‌గా ఇద్దరు స్కావేంజర్లను నియమించాల్సి ఉండగా ఒక వర్కర్ నియమించి, ఇంకో వర్కర్ రికార్డులో చూపించి ఒక వర్క ర్ జీతం ప్రిన్సిపాల్ అమాంతం మింగుతున్నాడనీ పేర్కొన్నారు. వెంటనే సంభంధిత ఉన్నత అధికారులు ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో జరిగే అవినీతి అక్రమాలపై దృష్టి సారించి పాఠశాల నిధుల గోల్‌మాల్‌కు పాల్పడిన ప్రిన్సి పాల్, అతనికి సహకరించిన ఎంఈఓ, డిఈఓలపై కఠిన చర్య తీసుకోవాలనీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు తగిన న్యాయం చేయాలనీ, లేని పక్షంలో విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు ఏకమై భారీఎత్తున ధర్నా కార్య క్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వానికి హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసంఘటిత సంఘాల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఐతు బాపు, యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు అక్కల బాపుయాదవ్, తెలం గాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్య క్షులు పీక కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాసి పార్వతి. ఆదివాసీ మహిళా నాయకు రాలు కాల్నేని రాజమణి, ఆదివాసి జిల్లా నాయకుడు గొట్టం ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు

# యావర్ రోడ్డు విస్తరణ విషయమై ప్రభుత్వ సలహాదారును కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

(ఆకాంక్ష న్యూస్)



జగిత్యాల, నవంబర్ 27 : జగిత్యాల పట్టణ ప్రజలకు చాలా రోజుల నుంచి యావర్ రోడ్డు ప్రధాన సమస్యగా మారిందని, ఈ రోడ్డు విస్తరణకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం ఆయన కార్యాలయంలో కలిసి యావర్ రోడ్డు విస్తరణ విషయమై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ..2023 లో జగిత్యాల పట్టణానికి సంబంధించి యావర్ రోడ్డు వెడల్పు జరిగితే దానికి ఏ విధమైన పరిహారం ఇవ్వచ్చు అనే విషయమై జిహెచ్ఎంసి కావచ్చు లేదా హైదరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ట్రాన్స్ఫర్ ఆఫ్ డెవలప్మెంట్ రైట్స్ కింద రోడ్డు వెడల్పు కార్యక్రమం జరిగితే నష్టపరిహారం ఏ విధంగా ఇవ్వాలని విషయంలో జిహెచ్ఎంసి హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో ట్రాన్స్ఫర్ ఆఫ్ డెవలప్మెంట్ రైట్స్ కింద రోడ్డు వెడల్పు జరిగితే డైరెక్ట్ గా వెబ్సైట్లో పెడితే బిల్డర్స్ మున్సిపల్ వారు తెలియజేసిన ప్రకారం పేమెంట్ చేసి ఆ హక్కును తీసుకొని అక్కడ వారు కన్స్ట్రక్షన్ చేస్తారనీ అన్నారు. జీవో మన జగిత్యాల పట్టణానికి సంబంధించి తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ విషయంలో రాతపూర్వకంగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పనులు సంక్షేమ పద్దులు రివ్యూ చేసే అధికారం రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులకు ఇచ్చారని, జగిత్యాల యావర్ రోడ్డు వెడల్పు విషయంలో సుదర్శన్ రెడ్డినీ చొరవ తీసుకోమని కోరడం జరిగిందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన సుదర్శన్ రెడ్డి వెంటనే ఆయన సహాయకుల్ని పిలిచి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రితో మీటింగ్ ఏర్పాటు చేయవలసిందిగా చెప్పినట్లు సంజయ్ కుమార్ తెలిపారు. జగిత్యాల పట్టణ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, అవకాశం ఇచ్చిన ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని, జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# నేత్రదానంకు అంగికరించిన బయాలాజీ టీచర్ అంజన్ కుమార్

## - అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

(ఆకాంక్ష న్యూస్)



కోల్‌సిటి (గోదావరిఖని), నవంబర్ 27 : ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ళ అంజన్ కుమార్ తన మరణానంతరం తన నేత్రాలను దానం చేస్థానని, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు అంగీకారక పత్రాన్ని అంద జేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గోదావరిఖని పట్టణ అధ్యక్షులు బోళ్ల చంద్రశేఖర్ తదితరులు అంజన్ కుమార్ ను అభినందిస్తూ అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. జయరాజు తోపాటు ఉపాధ్యాయులు కేడం శ్రీనివాస్, శ్రీధర్ రావు, అనురాధ, శ్రీధర్, రమేష్, ఓ. శంకరయ్య స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణా రెడ్డి, నూక రమేష్, లగిశెట్టి, చంద్రమౌళి, మారెల్లి రాజిరెడ్డి, భీష్మాచారి, వాసు, అనంతరాములు, కవిత, చంద్రశేఖర్ తదితరులు అంజన్ కుమార్ ను అభినందించారు.

# ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు

## - ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలి
## - నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్



(ఆకాంక్ష న్యూస్)

జగిత్యాల, నవంబర్ 27 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో మేడిపల్లి మండల కేంద్రం, కొండాపూర్, కల్వకోట, కట్లకుంట గ్రామాలు, కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించబడ్డాయా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వరకు ఎన్ని నామినేషన్లు స్వీకరించబడ్డాయి, అలాగే నామినేషన్ల ఫార్మ్స్ ఎంతమంది అభ్యర్థులు తీసుకున్నారనే వివరాలను సంబంధిత అధికారుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆయన పలు సూచనలు అందించారు. నామినేషన్ ప్రక్రియ చట్టబద్ధంగా, ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు తొలి విడత ఎన్నికల ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. నవంబర్ 30 రోజున వీటి పరిశీలన ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 3 వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మొదటి విడతలో 07 మండలాల్లోని 122 గ్రామాలు, 1,172 వార్డుల్లో డిసెంబర్ 11 న ఉదయం 07 నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు పోలింగ్ జరగనుందని అదే రోజు మధ్యాహ్నం 02 గంటల నుండి ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అర్జీవన్ ఏరియాలో టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

(ఆకాంక్ష న్యూస్)



కోల్‌సిటి (గోదావరిఖని), నవంబర్ 27 : ఆర్జీవన్ పరిధిలో ఓసీపీ లు, వివిధ డిపార్ట్‌మెంట్ లో అద్దె ప్రాతిపదికన వాహనాలకు ఏరియా హాస్పిటల్ ఏసీ అంభులెన్స్ -2 అండ్ ఎక్స్ ప్లోరేషన్ డిపార్ట్ మెంట్ లో 4 డబ్ల్యూ డి నాన్ ఏసీ వెహికిల్స్ -1, 2 డబ్ల్యూ డి నాన్ ఏసీ -4 వెహికిల్స్ ను 5 సంవత్సరాల కాలానికి నెలవారీ అద్దె ప్రాతిపదికన 7 వాహనాలను,జిడికే కోల్ మైన్స్ 2,2ఎ అండ్ 5 వద్ద 3 సంవత్సరాల కాలానికి 1 వాహనాన్ని మొత్తం -8 వాహనములకు టెండర్లకు దరఖాస్తు లను ఆహ్వానిస్తున్నామని ఆర్జీవన్ ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు నవంబర్ 26 నుండి డిసెంబర్ 12 మధ్యాహ్నం 12.00 గంటల వరకు టెండర్లు వేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఇట్టి వాటిలో ప్రాజెక్ట్ ప్రభావిత వ్యక్తులు, ప్రాజెక్ట్ స్థానభ్రంశం చెందిన వారికి వాహనాలను డ్రైవర్లతో పాటు ఆసక్తిగల వాహన యజమానులు,కాంటాక్టర్ల నుండి దరఖాస్తులు కోరడం జరిగిందని తెలిపారు. అర్జీ వన్ ప్రాంతంలోని భూమిని కోల్పోయినవారు, ప్రాజెక్ట్ ప్రభావిత వ్యక్తులు ప్రాజెక్ట్ స్థానభ్రంశం చెందిన వ్యక్తి కేటగిరీ- కింద అర్హులుగా పరిగణించబడతరాని అయన పేర్కొన్నారు. కేటగిరీ 1" నందు ఎవరు టెండర్ ధరఖాస్తూలు చేయనిచో 2వ కేటగిరీ వ్యక్తులకు అవకాశం ఇవ్వబడుతుందని తెలిపారు. కాగా మొదటి, 2వ కేటగిరీ వ్యక్తులలో లేనిచో 3వ కేటగిరీ వ్యక్తులకు అవకాశం ఇవ్వబడుతుందని పేర్కొన్నారు.

# రామగుండం అభివృద్ధికి అడ్డుపడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, గట్ల రమేష్



(ఆకాంక్ష న్యూస్)

కోల్‌సిటి (గోదావరిఖని), నవంబర్ 27 : రామగుండం అభివృద్ధికి బిఆర్ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారని మాజీ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, శ్రీ కోదండ రామాలయ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గట్ల రమేష్‌లు ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలకు నిరసనగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో గురువారం హరీష్‌రావు దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ హరీష్ రావు ఆరోపణలు పూర్తిగా అబద్ధాలని అన్నారు. రామగుండం అభివృద్ధిని అడ్డుకున్నది గత ప్రభుత్వమేనని వారు విమర్శించారు. గత 10 ఏళ్లలో రామగుండంలో ఒక్క భారీ ప్రాజెక్ట్ కూడా తీసుకురాకపోయి,ఇప్పుడు వచ్చిన అభి వృద్ధి నిర్ణ యాలపై విమర్శించడం అంటే ప్రజల తీర్పును అవమానించడం అని అన్నారు. 62.5 మెగావాట్ల చిన్న యూనిట్ స్థానంలో 800 మెగావాట్ల. భారీ ప్రాజెక్ట్ కు అనుమతి ఇవ్వడం సాహోసపేతమైన నిర్ణయమన్నారు. కొత్త ప్రాజెక్టు వల్ల స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు. చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తెలంగాణ గ్రిడ్‌కి భారీగా విద్యుత్ లభిస్తుందన్నారు. ఎన్టీపీసీ-జెన్కో బిడ్డింగ్‌పై హరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని ఎన్టీపీసీ, జెన్కో రెండు సంస్థలు ఓపెన్ టెండర్ పెడతాయని తక్కువ బిడ్ వేసిన వారికి పనులు ఇస్తారన్నారు.

# ఆరోగ్యం

## బెల్లం,పచ్చి పసుపుతో శరీరంలో కొత్త శక్తి..ఈ విషయం తెలిస్తే అస్సలు ఆగరు




మిగతా సీజన్ లతో పోలిస్తే చలికాలంలో ఎక్కువ వ్యాధులు వచ్చే అవకాశముంటది కాబట్టి ఈ సీజన్ లో ఆరోగ్యం గురించి ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఈ సీజన్ లో వచ్చే అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. శీతాకాలంలో సూపర్ ఫుడ్ గా పరిగణించేవాటిలో పచ్చి పసుపు, బెల్లం కూడా ఉంటాయి. ఉదయాన్నే పచ్చి పసుపు, బెల్లం తింటే మన శరీరానికి బోలెడు ప్రయోజనాలు లభిస్తాయి. ఈ రెండు కలిపి శరీరాన్ని వెచ్చగా ఉంచడంతోపాటు లోపలి నుంచి పోషణను అందిస్తాయి.

ఎలా తినాలి పచ్చి పసుపు, బెల్లం ఆహారంలో చేర్చుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి. పచ్చి పసుపు,బెల్లం రెండింటిని కలిపి టీ తయారు చేసుకోవచ్చు, పెరుగుతో తినవచ్చు. ఈ రెండింటిని నీళ్లలో వేసి మరిగించి కూడా తాగవచ్చు.

తినడం వల్ల వచ్చే ప్రయోజనాలివే రక్తం శుద్ధి రక్తాన్ని శుద్ధి చేయడంలో బెల్లం చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని టాక్సిన్స్ ని తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. పచ్చి పసుపు రక్తం సన్నబడటానికి కూడా సహాయపడుతుంది..ఇది గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక వ్యవస్థబలోపేతం పచ్చి పసుపులో ఉండే కర్కుమిన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ఇది జలుబు, దగ్గు, ఫ్లూ మొదలైన వ్యాధులతో పోరాడటంలో సహాయపడుతుంది. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి,ఇది శరీరాన్ని వ్యాధుల నుండి కాపాడుతుంది. జీర్ణవ్యవస్థను ఆరోగ్యం పచ్చి పసుపు, బెల్లం రెండూ జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. పచ్చి పసుపు జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేస్తుంది, ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. బెల్లం జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

## కనుమ స్పెషల్ నాటుకోడి పులుసు..

**కనుమ రోజు చాలా మంది విందు భోజనం చేస్తుంటారు. మాంసాహారంతో ఇంటికి వచ్చిన అతిథులను విందు ఇస్తారు. కనుమ రోజు చేసుకునే వంటల్లో ముఖ్యంగా నాన్ వెజ్ వంటలు ప్రత్యేకం. అందులో ముఖ్యమైనది నాటుకోడి పులుసు. కనుమ రోజున నాటుకోడి పుసును చేసుకొని తింటే ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. అలాగే ఆరోగ్యానికి కూడా ఈ నాటుకోడి పులుసు చాలా మంచిది. ఇంతకీ ఈ నాటుకోడి పులుసు ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? కనుమ స్పెషల్‌గా దీనిని ఎలా చేసుకోవాలి అనేది ఈ స్టోరీలో చెప్పాము. పూర్తిగా చదవండి.**



నాటుకోడి పులుసు కావాల్సిన పదార్థాలు: నాటుకోడి – 1 కిలో మిరియాల పొడి – 1 టేబుల్ స్పూన్ కారం పొడి – 1 టేబుల్ స్పూన్ కొత్తిమీర తాలూకు – 1 టేబుల్ స్పూన్ కరివేపాకు – కొద్దిగా ఉల్లిపాయ – 2 తోటకూర – కొద్దిగా పసుపు – 1/2 టీస్పూన్ అల్లం – చిన్న ముక్క వెల్లుల్లి – 5 రేబలు దోసకాయ – 1 నిమ్మకాయ – 1 కొబ్బరి తురుము – 1/2 కప్ నూనె – 2 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి తగినంత నాటుకోడి పులుసు తయారీ విధానం: ముందుగా కిలో నాటుకోడిని శుభ్రంగా కడిగి, చిన్న ముక్కలుగా కోసుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తరువాత పాత్రలో నూనె పోసుకోవాలి. నూనె వేడయ్యాక అందులో అందులో అల్లం, వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. ఆ అల్లం, వెల్లుల్లి రెబ్బలు లేత గోధుమ రంగులోకి వచ్చేంత వరకు వేయించుకోవాలి. అలాగే తరువాత ఉల్లిపాయ ముక్కలు వేసుకొని అవి కూడా లేత బంగారు రంగులోకి వచ్చేంత వరకు బాగా వేయించుకోవాలి. అలాగే అందులోని కరివేపాకులు, కొత్తిమీర వేసుకొని వేయించుకోవాలి. ఆ తరువాత ఆ మిశ్రమంలో కట్ చేసుకొని పెట్టుకున్న నాటుకోడి ముక్కలను వేసుకోవాలి. వాటిని బాగా వేయించుకోవాలి. అందులో పసుపు, మిరియాల పొడి, కారం వేసుకొని అవి మొత్తం ముక్కలకు సరిగ్గా కలిసే విధంగా కలుపుకోవాలి. అలాగే అందులో కొంచెం నీరుపోసుకొని బాగా కలుపుకొని ఉడికించుకోవాలి. కూర మృదువుగా అయ్యాక మూత తీసి అందులో కొబ్బరి తురుము వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత రుచికి తగినంత ఉప్పు వేసుకోని బాగా కలుపుకోవాలి. చివరగా తోటకూర, దోసకాయ ముక్కలు వేసుకొని కొద్దిసేపు ఉడికించుకోవాలి. ఆ తరువాత నిమ్మరసం పిండుకొని.. ఒక్క నిమిషం ఉడికించుకొని సర్వ్ చేసుకుంటే కనుక ప్రత్యేకమైన నాటుకోడి పులుసు సిద్ధమైనట్లే.

## బెంగాలీ స్పెషల్ 'లిక్కర్ ఛాయ్'




బెంగాలీ ప్రజలు పొద్దుపొద్దునే లిక్కర్ ఛాయ్ తాగుతుంటారు. కొంతమంది దీనిని బ్లాక్ టీ అని కూడా పిలుస్తారు. ఈ టీ ఆరోగ్యానికి కూడా చాలామేలు చేస్తుందని చెబుతారు. పొద్దున్నే అరకప్పు ఈ టీ తాగితే మత్తు వదిలిపోతుందని.. రీప్రెష్ అయిపోతారని బెంగాలీలు అంటుంటారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఈ ఛాయ్ తాగుతుంటే ఆ మజా మాటల్లో వర్ణించలేని టేస్ట్ ఉంటుందంటారు. మరీ బెంగాలీలు అమితంగా ఇష్టపడే లిక్కర్ ఛాయ్ ని మీరు కూడా మీ ఇంట్లో ఎలా చేసుకోవాలో ఇక్కడ చూడండి.

లిక్కర్ టీ తయారీకి కావాల్సిన పదార్థాలు –1 ఇంచు అల్లం –పావు టీ స్పూన్ మిరియాలు –3 టేబుల్ స్పూన్ల చక్కెర –1 టీస్పూన్ టీ పొడర్ –2 బిర్యానీ ఆకులు

లిక్కర్ టీ తయారీ విధానం –లిక్కర్ టీ కోసం 300 గ్రాముల నీళ్లు బాగా మరిగించి అందులో పంచదార వేసి నీళ్లను తెర్లకాగనివ్వాలి. –పంచదార కరిగి నీళ్లు తెర్లుతున్నప్పుడు అందులో బిర్యానీ ఆకులు, కచ్చాపచ్చాగా దంచిన అల్లం, కచ్చాపచ్చాగా దంచిన మిరియాలు వేసి హై ఫ్లేమ్ మీద పొంగనివ్వాలి. –నీళ్లు రంగు మారిన తర్వాత అందులో టీ పౌడర్ వేసి హై ఫ్లేమ్ మీద ఒక నిమిషం మరిగించి స్టవ్ ఆఫ్ చేసేయండి. –ఈ టీనిని వడకట్టుకొని గ్లాస్ లో పోసుకుంటే తాగడానికి టేస్టీ లిక్కర్ టీ రెడీ.

## ముంబై ఫేమస్ వడాపావ్

**వడాపావ్ అంటే చాలా మందికి తెలిసే ఉంటుంది. ముంబైలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఈ స్ట్రీట్ వంటకాన్ని ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు. పెద్ద పెద్ద హీరోలు సైతం ముంబైకి వెళ్ళినప్పుడు దీనిని ఎంత ఇష్టంగా తింటూ ఉంటారు. ఇది చాలా అద్భుతమైన రుచితో ఉంటుంది. అలాగే దీనిని చేసుకోవడం కూడా చాలా సులభం. ముంబై స్టైల్‌లో ఈ వడాపావ్ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.**



వడాపావ్ తయారు చేసుకోవడానికి కావాల్సిన పదార్థాలు బంగాళాదుంపలు శనగపిండి పసుపు ఎండు మిరపకాయలు కొత్తిమీర రుచికి సరిపడా ఉప్పు నూనె పావ్ బన్స్

వడాపావ్ తయారీ విధానం ఈ వడాపావ్ తయారు చేసుకోవడానికి ముందుగా బంగాళాదుంపలను బాగా ఉడికించుకోవాలి. అలాగే వాటిని మెత్తగా చేసుకొని పెట్టుకోవాలి. మెత్తగా చేసుకున్న బంగాళాదుంపలు పసుపు, ఎండు మిరపకాయలు, కొత్తిమీర, రుచికి సరిపడా ఉప్పు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత ఒక బౌల్ తీసుకొని అందులో శనగ పిండిని తీసుకోవాలి. అందులో కొద్దిగా నీరు కలుపుకొని పిండి మాదిరిగా చేసుకోవాలి. ఆ తరువాత బంగాళాదుంప మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఆ ఉండలను వేడి ఫ్రై చేయడానికి నూనె వేడి చేసుకోవాలి. నూనె వేడయ్యాక అందులో బంగాళాదుంప ఉండలను శనగ పిండిలో ముంచుకొని నూనెలో వేయించుకోవాలి. అలా అన్ని ఉండలను వేయించుకున్నాకా.. పావ్ బన్ను తీసుకోవాలి. ఆ బన్నును సగానికి చీల్చుకోవాలి. సగం చీల్చిన తరువాత అందులో బంగాళాదుంప వడను బన్ను మధ్యలో పెట్టుకోవాలి. ఆ తరువాత దానిపై కొత్తిమీర చట్నీ, ఇతర మసాలా సాంబార్‌ను పోసుకోవాలి. అంతే ముంబైలో ఎంతో ఫేమస్ అయిన వడాపావ్ సిద్ధమైనట్లే. దీనిని మీ ఇంట్లోనే ఓసారి ట్రై చేసి రుచి చూడండి. అద్భుతంగా ఉంటుంది అంతే.



## ఓట్స్ పకోడీ ఎప్పుడైనా తిన్నారా?

**ఓట్స్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అయితే మీరు ఎప్పుడైనా ఓట్స్ తో చేసిన పకోడీ తిన్నారా? తినకపోయినట్లయితే ఓసారి టేస్ట్ చేయాల్సిందే. రుచి అద్భుతంగా ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో ఓట్స్ పకోడీ చేసుకొని తింటే వేడి వేడిగా శరీరంలో కొత్త శక్తి వస్తుంది. ఓట్స్ తో పకోడీ చేయడం చాలా చాలా ఈజీ. ఓట్స్ తో పకోడీ తయారు చేయడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.**

ఇన్ స్టంట్ ఓట్స్ పకోడి తయారీకి కావాల్సిన పదార్థాలు – 1కప్పు ఓట్స్ –పావు కప్పు బియ్యం పిండి –పావు కప్పు శెనగ పిండి –1 పచ్చిమిర్చి –1 టీస్పూన్ కారం –1/4 టీస్పూన్ పసుపు –1/2 టీస్పూన్ గరం మసాలా పౌడర్ –2 ఉల్లిపాయలు –అల్లం వెల్లుల్లి పేస్ట్ –ఉప్పు –కరివేపాకు –కొత్తిమీర –జీడిపప్పు

ఓట్స్ పకోడి తయారీ విధానం –ఓ బౌల్ లో 1కప్పు ఓట్స్ వేసి అందులో కొంచెం నీళ్లు పోసి తడిపి పక్కనపెట్టుకోండి. –రెండు నిమిషాల తర్వాత అందులో బియ్యపు పిండి, శెనగ పిండి, పచ్చిమిర్చి ముక్కలు, కట్ చేసిన కరివేపాకు, కొత్తిమీర తరుగు, ఉప్పు, కారం, పసుపు, గరం మసాలా పౌడర్, అల్లం వెల్లుల్లి పేస్ట్,ఉల్లిపాయ చీలికలు వేసి బాగా కలుపుకోండి. –కొంచెం కొంచెం నీళ్లు చల్లుకుంటూ పకోడి పిండిలా కొంచెం గట్టిగానే కలుపుకోండి. అందులోనే కొన్ని జీడిపప్పులు కూడా వేసుకోండి. –ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి ఆయిల్ వేడి చేడిన తర్వాత అందులో పకోడీలా పిండిని వేసుకోండి. ఉడికిన తర్వాత వాటిని ఓ ప్లేట్ లోకి తీసుకొని సర్వ్ చేసుకోవడమే.

# సినిమా న్యూస్



## నిఖిల్.. చరిత్ర నుంచి భవిష్యత్తు వరకు



టాలీవుడ్ లో ఒకప్పుడు లవర్ బాయ్ గా కనిపించిన నిఖిల్ సిద్ధార్థ్, ఇప్పుడు రూట్ పూర్తిగా మార్చేశాడు. 'కార్తికేయ 2' ఇచ్చిన పాన్ ఇండియా సక్సెస్ అతన్నీ మామూలు కథల వైపు చూడనివ్వడం లేదు. కేవలం హిట్టు కొట్టడమే కాదు, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకోవాలనే కసి అతని లైనప్ లో స్పష్టంగా కనిపిస్తోంది. అనౌన్స్ చేసిన సినిమాలు చూస్తుంటే, ఏదో పెద్ద ప్లానింగే జరుగుతోందని అర్థమవుతోంది. సాధారణంగా హీరోలు ఒక జానర్ హిట్ అయితే, అదే దారిలో వెళ్తుంటారు. కానీ నిఖిల్ మాత్రం ప్రతీ సినిమాకు ఒక కొత్త ప్రపంచాన్ని ఎంచుకుంటున్నాడు. ఇప్పుడు చేతిలో ఉన్న నాలుగు సినిమాలు, నాలుగు విభిన్నమైన జోనర్లు కావడం విశేషం. చరిత్ర నుంచి భవిష్యత్తు వరకు, డివోషనల్ నుంచి సైన్స్ ఫిక్షన్ వరకు అన్నింటినీ కవర్ చేసేస్తున్నాడు. ఆ లైనప్ వివరాలు తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ముందుగా 'స్వయంభు' సినిమాతో యుద్ధభూమిలో దిగుతున్నాడు. ఒక యోధుడిగా, చక్రవర్తిగా నిఖిల్ చేస్తున్న ఈ భారీ సినిమా ఫిబ్రవరి 13న రిలీజ్ కానుంది. ఆ వెంటనే 1905 నాటి లండన్ బ్యాక్ డ్రాప్ లో 'ది ఇండియా హౌస్' అనే పీరియాడిక్ సినిమా చేస్తున్నాడు. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన ఒక విప్లవాత్మక కథతో ఇది తెరకెక్కుతోంది. రామ్ చరణ్, విక్రమ్ రెడ్డి నిర్మాతలుగా ఉండటం దీనికి మరో బలం. ఇక దేశం మొత్తం ఎంతగానో ఎదురుచూస్తున్న 'కార్తికేయ 3' గురించి ఆసక్తికరమైన పాయింట్ లాక్ చేశారు. ఈసారి డాక్టర్ కార్తికేయ సముద్రం అడుగున ఉన్న ద్వారక నగర రహస్యాలను ఛేదించడానికి వెళ్తున్నాడు. ఈ పాయింట్ వింటూనే గూస్ బంప్స్ వస్తున్నాయి. దీనికి తోడు ఏషియన్ సినిమాస్ తో కలిసి ఒక కొత్త తరహా సైన్స్ ఫిక్షన్ సూపర్ హీరో సినిమాను కూడా నిఖిల్ లైన్లో పెట్టాడు. ఈ లైనప్ గమనిస్తే నిఖిల్ కేవలం తెలుగు మార్కెట్ నే కాదు, నేషనల్ మార్కెట్ ను గట్టిగా టార్గెట్ చేశాడని అర్థమవుతోంది. ఒక పక్క భక్తి, మరో పక్క దేశభక్తి, ఇంకో పక్క టెక్నాలజీ.. ఇలా అన్ని వర్గాల ఆడియన్స్ ను కవర్ చేసేలా పక్కా స్కెచ్ వేశాడు. ఏ రెండు సినిమాలకు సంబంధం లేకుండా వైవిధ్యం చూపించడమే నిఖిల్ స్ట్రాటజీగా కనిపిస్తోంది. మొత్తానికి టైర్ 2 హీరోల్లో నిఖిల్ సెలెక్షన్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. రిస్క్ ఉన్నా సరే, కంటెంట్ నమ్ముకుని భారీ బడ్జెట్ సినిమాలకు శ్రీకారం చుడుతున్నాడు.

## ఆ ద్వయానికి ఛాన్స్ ఇచ్చింది రామ్!



%-%ఆంధ్రాకింగ్ తాలూకా%-% చిత్రానికి ఎనర్జిటిక్ స్టార్ రామ్ కర్త, కర్మ, క్రియగా పని చేసినట్లు చెప్పొచ్చు. తొలుత ఈ కథను దర్శకుడు మహేష్ నుంచి విన్నది రామ్. అక్కడ నుంచి స్క్రిప్ట్ మైత్రీ మూవీ మేకర్స్ కు చేరింది. రామ్ చెప్పడంతో మైత్రీ నిర్మాతలు ఒకే చెప్పారు. అక్కడ కూడా సింగిల్ సిట్టింగ్ లోనే స్క్రిప్ట్ ఒకే అయింది. దీంతో ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. రామ్ గనుక ఛాన్స్ తీసుకోకపోయి ఉంటే? ఇది పట్టాలెక్కేది కాదు. రామ్ ప్లాప్ ల్లో ఉన్నా? అతడి పై నమ్మకంతో పాటు, కథపై నమ్మకంతో ముందుకొచ్చారు. తాజాగా మ్యూజిక్ డైరెక్టర్లను కూడా రామ్ నే సెట్ చేసాడని తేలింది. తమిళ దర్శక ద్వయం వివేక్-మెర్విన్ లైతే ఈ కథకు బాగుంటుందని వాళ్లను పిలిపించి సంగీతం బాధ్యతలు అప్పగించారు. తెలుగులో ఇంత వరకూ ఈ ద్వయం ఏ సినిమాకు పని చేయలేదు. %-%ఆంధ్రాకింగ్ తాలూకా%-%తోనే టాలీవుడ్ లో లాంచ్ అయ్యారు. అంతకు ముందు తమిళ్ లో 20 సినిమాలకు సంగీత దర్శకులుగా పనిచేసారు. కానీ వారి ప్రతిభను టాలీవుడ్ లో ఏ మేకర్ గుర్తించలేదు. ఆ సమయంలో రామ్ వాళ్ల ప్రతిభను గుర్తించి అవకాశం ఇచ్చారు. ఆ రకంగా వివేక్ -మెర్విన్ టాలీవుడ్ లో లాంచ్ అయ్యారు. ఈ సినిమాలో ఓ పాటను రామ్ రచించడం విశేషం. అంతేనా ఆ పాటను ఏకంగా అనిరుద్ తో పాడించడం అంతకు మించిన గొప్ప విశేషంగా చెప్పొచ్చు. సాధారణంగా మ్యూజిక్ డైరెక్టర్ల విషయంలో దర్శకుడు ఇన్వాల్వ్ మెంట్ ఉంటుంది. అతడు కూడా కొంత మందిని తీసుకుం దామనే ఆలోచనలో ఉంటారు. కానీ మహేష్ విషయంలో ఆఛాన్స్ కూడా రామ్ తీసుకోవడంతో? పని ఈజీ అయింది. కొన్ని గంటల క్రితమే రిలీజ్ అయిన ఈ సినిమాకు మంచి రివ్యూలు వస్తున్నాయి. దీంతో రామ్ ఖాతాలో చాలా కాలానికి హిట్ పడినట్లే. %-%ఇస్మార్ట్ శంకర్%-% తర్వాత నటించిన సినిమాలన్నీ ప్లాప్ అయ్యాయి. దీంతో ఆప్రభావం మార్కెట్ పై కూడా పడింది. కొత్త కమిట్ మెంట్లు కూడా తగ్గాయి. కానీ తాజా విజయంతో అన్నీ మళ్లీ సెట్ అవ్వడం ఖాయం. అలాగే వివేక్-మెర్విన్ లకు ఇకపై అవకాశాలు పెరుగుతాయి. ఇప్పటికే కొన్ని ప్రాజెక్ట్ లకు ఒకే చెప్పారు. కానీ వీటి విరాలు ఆ చిత్ర నిర్మాత లే ప్రకటిస్తారని గోప్యంగా ఉంచారు. ప్రస్తుతం ఈ సంగీత ద్వయం కోలీవుడ్ ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్నారు. అన్ని జానర్ చిత్రాలకు తాము సంగీతం అందించడానికి సిద్దంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో సొంత ప్రతిభ కంటే పరభాషా ప్రతిభావంతులకు మంచి అవకాశాలు దక్కుతుంటాయన్నది తెలిసిందే.

## సమంత.. ఫేవరెట్ టైమ్ ఏంటో తెలుసా?




స్టార్ హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో ఫుల్ గా యాక్టివ్ గా ఉంటారన్న విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తుంటారు. తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన అప్డేట్స్ కూడా ఇస్తుంటారు. అవి ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్.. నెట్టింట స్పెషల్ గా ఉండి ఆకట్టుకుంటాయి. తాజాగా తన ఇయర్ లో ఫేవరెట్ టీమ్ ఏంటో చెబుతూ పోస్ట్ చేశారు సమంత. అంతకుముందు ముంబైలోని తన ఇంటి మెయిన్ డోర్ పిక్ ను షేర్ చేశారు. డోర్ చుట్టూ స్పెషల్ డెకరేషన్ చేసి ఉంది. మరోనెల రోజుల్లో క్రిస్మస్ పండుగ రానుండగా.. ఇప్పుడే సామ్ ఆ ఫెస్టివల్ మోడ్ లోకి వెళ్లిపోయారు. తన ఇంటిని డెకరేట్ చేసుకున్నారు. ఇంటి మెయిన్ డోర్ కు ఓవైపు క్రిస్మస్ ట్రీ పార్ట్ ను అటాచ్ చేయగా.. మరోవైపు స్టైలిష్ "%యాూవీ%"లోగో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ సంవత్సరం ఇలా అన్నట్లు క్యాప్షన్ ఇవ్వగా.. మరో పిక్ లో ఇంట్లో క్రిస్మస్ థీమ్ డెకరేషన్ చేసుకున్న పిక్ పోస్ట్ చేశారు. ఆ ఫోటోకు అదే తన ఫేవరెట్ టైమ్ అంటూ రాసుకొచ్చారు సమంత. ప్రస్తుతం సమంత ఇన్ స్టా స్టోరీస్ కు సంబంధించిన స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. దీంతో డెకరేషన్ అదిరిపోయిందని సామ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అడ్వాన్స్ హ్యాపీ క్రిస్మస్ అంటూ విషెస్ చెబుతున్నారు. ఫుల్ గా సెలబ్రేట్ చేసుకోండని అంటున్నారు. అయితే సమంత.. పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలతో కొంతకాలంగా వార్తల్లో నిలుస్తున్నారు. గత కొంత కాలంగా బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఆమె సన్నిహితంగా ఉన్నారని, వారిద్దరూ డేటింగ్ లో ఉంటున్నారని సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఎక్కడా సమంత రెస్పాండ్ అవ్వలేదు. కానీ రాజ్ నిడిమోరుతో కలిసి పార్టీలకు, సినిమా ఈవెంట్స్ కు సామ్ వెళ్లడంతో రిలేషన్ షిప్ రూమర్లకు మరింత బలం చేకూరుతుంది. వారిద్దరూ ఎక్కడ కనిపించినా అక్కడికి సంబంధించిన వీడియోలు, దిగిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. రీసెంట్ గా దీపావళి పండుగ ఇద్దరూ కలిసి జరుపుకున్నారు. మరి రిలేషన్ షిప్ రూమర్స్ లో నిజమెంతో వారికే తెలియాలి.

## ఎల్లమ్మ.. ఇబ్బందులు దాటేదెలా..?



బలగం సినిమాతో సూపర్ హిట్ అందుకున్న వేణు యెల్దండి తన రెండో సినిమాను ఎల్లమ్మ అంటూ ప్రకటించాడు. దాదాపు రెండేళ్ల నుంచి ఆ సినిమా స్క్రిప్ట్ మీద కూర్చున్న వేణు అదిరిపోయేలా కథ రాసుకున్నాడు. సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొత్తం పూర్తైంది. బలగం లాంటి హిట్ ఇచ్చాడు కాబట్టి ఈసారి వేణు కోరినంత బడ్జెట్ ఇచ్చేందుకు దిల్ రాజు డిసైడ్ అయ్యారు. ఇక సినిమా మొదలు పెట్టడమే తరువాయి అనుకుంటున్నటైం లో ఎల్లమ్మ కాస్టింగ్ పై జరుగుతున్న చర్చలు షాక్ ఇస్తున్నాయి. తమ్ముడు డిజాస్టర్ అవ్వడంతో.. ముందు ఈ సినిమాలో హీరో ఎవరన్నది ఇప్పటికీ సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఎల్లమ్మ సినిమాను ముందు నానితో చేయాలనుకున్నాడు వేణు కానీ హీరోయిన్ పాత్రకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఉండటం వల్ల అతను కాదన్నాడట. ఇక రేసులో నితిన్ వచ్చాడు. ఐతే దిల్ రాజు, నితిన్ చేసిన తమ్ముడు డిజాస్టర్ అవ్వడంతో నితిన్ తో ఎల్లమ్మ కూడా రిస్క్ అని భావించాడు దిల్ రాజు. అందుకే ఎల్లమ్మలో నితిన్ దాదాపు కన్ ఫర్మ్ అని చెప్పి మరీ అతన్ని బయటకు వెళ్లేలా చేశారు. ఇక శర్వానంద్ తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ కూడా ఈ సినిమాలో నటిస్తాడన్న వార్తలు వచ్చాయి. వీరవరు కాదు మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాలో నటిస్తున్నారని అంటున్నారు. ఐతే ఎల్లమ్మ హీరో గురించి ఇంతగా డిస్కషన్ జరుగుతుండగా హీరోయిన్ గా కీర్తి సురేష్ ఫైనల్ అని అనుకున్నారు. వేణు ఈ సినిమాలో ముందు సాయి పల్లవిని హీరోయిన్ గా అనుకోగా ఆమె ఈ సినిమా చేయడానికి డేట్స్ అడ్జెస్ట్ కావని చెప్పడంతో ఆ ఆఫర్ కీర్తి సురేష్ కి వచ్చింది. ఐతే లేటెస్ట్ గా కీర్తి సురేష్ తన కొత్త సినిమా రిలీజ్ ప్రమోషన్స్ లో ఎల్లమ్మలో తాను నటించట్లేదని చెప్పి షాక్ ఇచ్చింది. ఎల్లమ్మ సినిమాలో ఇన్నాళ్లు హీరో మాత్రమే కన్ ఫర్మ్ అవ్వలేదని అనుకుంటుండగా ఇప్పుడు హీరోయిన్ కూడా లేదన్న మ్యాటర్ అర్థమైంది. కీర్తి సురేష్ ముందు చేయాలని అనుకుని తర్వాత కాదన్నదా లేదా ఆమె ముందు నుంచి రిజెక్ట్ చేసిందా అన్నది తెలియాల్సి ఉంది. కీర్తి సురేష్ ఎల్లమ్మ కామెంట్స్ పై ఆడియన్స్ అంతా షాక్ అవుతున్నారు.కీర్తి కాకపోతే ఎల్లమ్మ లో ఫిమేల్ లీడ్ గా ఎవరికి ఛాన్స్ ఇస్తారు.

సినిమాలో హీరోయిన్ పాత్ర వెయిట్ ఎక్కువ ఉంటుందని తెలిసినా కూడా ఎవరు ఈ ప్రాజెక్ట్ పై ఎందుకు ఆసక్తి చూపించట్లేదు అన్నది తెలియాల్సి ఉంది. మరి దిల్ రాజు ప్రొడక్షన్ లో ప్రెస్టీజియస్ గా రాబోతున్న ఎల్లమ్మ మీద ఇన్ని రకాలుగా డిస్కషన్ జరగడం కొత్తగా ఉంది. మరి వీటన్నిటికీ ఆన్సర్ ఇస్తూ ఎస్.వి.సీ బ్యానర్ నుంచి ఏదైనా అప్డేట్ వస్తే బెటర్ లేదంటే సినిమా మీద ఉన్న ఇంట్రెస్ట్ కాస్త పడిపోయే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com